




సమ్మెనుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

ఎటు చూసినా చెత్తే

- మున్సిపల్ క్లాప్ డ్రైవర్లు సమ్మెతో నగరం దుర్గంధం - నేటి నుంచి ఇతర మున్సిపల్ కార్మికులు కూడా సమ్మెలోకి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నిత్యం చెత్త సేకరించే క్లాప్ డ్రైవర్లు సమ్మెలోకి వెళ్లడంతో కర్నూలు నగరంలో పలువీధులలో ఎక్కడి చెత్త పేరుకుపోయింది. క్లాప్ డ్రైవర్ల సమస్యను పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారు. కాంట్రాక్టు ఉద్యోగులకు జీతాలు ఇవ్వాల్సిన రెడ్డి ఏజెన్సీపై అధికారులకు ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవడానికి వెనుకాడుతున్నారు. అయితే నేటినుంచి మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులందరూ సమ్మలోకి పోతున్నారు. రోజుకు 1080 టన్నుల చెత్తను సేకరించాల్సి ఉంటుంది. 873 కాంట్రాక్టు కార్మికులు , 198 రెగ్యుల్ కార్మికులు ఉన్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో అరకొర చెత్త సేకరిస్తున్నారు. దీంతో ఎక్కువశాతం చెత్త పేరుకు పోతుంది. దీంతో నగరంలో చెత్తపేరుకు పోయి అనారోగ్య సమస్యలు పెరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే స్పందించాల్సిన అవసరం ఉంది. క్లాప్ డ్రైవర్ల సమస్యలు దాని వెనుక ఉన్న పరిస్థితులపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం....



నగరంలో పేరుకుపోయిన చెత్తను చూపుతున్న నాయకులు (ఫైల్)

నగరమంతా 98 మంది రెడ్డి ఏజెన్సీ ద్వారా 2022 ఫిబ్రవరి 7న నియమించిన క్లాప్ ఆటో డ్రైవర్లుగా ఉత్తర్వులు తీసుకొని జాయిన్ అయ్యారు. వారికి ఒప్పందం ప్రకారం పిఎఫ్, ఇఎస్ఐతో పాటు రూ.18,500 ఇవ్వాలి. పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కూడా కల్పించాల్సి ఉంది. కర్నూలు నగరంలో 98 మంది క్లబ్ ఆటో డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. చేరిన మొదటి రోజుల్లో మేనెల వరకు రూ.9,270 ఇచ్చారు. జూన్ 2022 నుండి రూ. 10, 118 చొప్పున నాలుగు నెలలు ఇచ్చారు. ఆ తరువాత వారికి వేతనాలు సక్రమంగా ఇవ్వకపోవడంతో ఆటోలను బంద్ చేసి నిరసన కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్, మేయర్ స్థానిక కార్పొరేటర్లు ,ఎంపీలు, ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేకపోవడంతో లేబర్ ఆఫీసర్‌ను సంప్రదించగా ఆయన పిలిపించి మాట్లాడి పెండింగ్ జీతాలు ఇచ్చి వారిని విధుల్లోకి తీసుకునేలా సంప్రదించారు. కమిషనర్ హామీతో విధుల్లో చేరి రెండు నెలల అయినప్పటికీ రెడ్డి ఏజెన్సీ వారు జీతాలు ఇవ్వకపోవడంతో సమస్య మొదటికి వచ్చింది. మళ్ళీ కుటుంబాలు పోషించుకోలేని స్థితిలో క్లాప్ఆటో డ్రైవర్లు సమ్మెబాట పట్టాల్సి వచ్చింది. కమిషనర్‌ను సంప్రదించగా 'మీరు మాకు సంబంధం లేదు. మేము జిడిఎంఎలో అమౌంట్ జమ చేస్తాం. మీకు రెడ్డి ఏజెన్సీ ద్వారా జీతాలు ఇవ్వాలి. రెడ్డి ఏజెన్సీ వారినే అడగండి..' అని చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో మీరు మళ్లీక్లాప్ ఆటోలు బంద్ చేసి సమ్మెబాట బట్టి నేటికీ 20 రోజులైనా అధికారులు , ప్రభుత్వం, వారికి ఇవ్వాల్సిన బకాయిలు ఇస్తామని చెప్పడం లేదు. దీనితో కమిషనర్ మీ సమ్మె మీరు చేసుకోండి రోజుకు రూ.400 చొప్పున ఇస్తాము వచ్చి చేరండని చెబుతున్నారు. బకాయి పడ్డ వేతనాలు ఇచ్చేంతవరకు తాము విధుల్లో చేరేది లేదని సమ్మె కొనసాగిస్తున్నారు. ఎక్కడి చెత్త అక్కడ పేరుకు పోయింది. కొత్తపేట అల్మాస్ ఫంక్షన్ హాల్ కెకెఎం సప్లయర్స్ వద్ద, ఎస్ఆర్ఎమ్‌టి ఎదురుగా రాఘవేంద్ర స్వామి గుడి , లాల్ మసీదు దగ్గర గౌలిగిరి, చిన్న మార్కెట్, ఎర్రబురుజు, బండి మెట్ట, కర్బలా మసీదు దగ్గర, అలీ షేర్ బాగ్ ,శ్రీరామ్ నగర్, బుధవార పేట, వడ్డగేరి తదితర ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయి కంపు కొడుతుంది. సమ్మె ఇలాగే కొనసాగితే దోమలు అధికమై ప్రజల అనారోగ్యాల పాలు అయ్యే పరిస్థితి ఉంది. ప్రభుత్వం స్పందించి రెడ్డి ఏజెన్సీని రద్దుచేసి బకాయి వేతనాలు ఇచ్చి క్లాప్ ఆటో డ్రైవర్లను వెంటనే విధుల్లోకి తీసుకొని వీధుల్లోని చెత్తను శుభ్రం చేసినట్లయితే కర్నూలు నగరం స్వచ్ఛ సర్వేక్షన్‌లో మొదటి స్థానం వస్తుందని చెప్పవచ్చు.

దోమలు ఎక్కువయ్యాయి : వడ్డే గేరి మౌలాబి



వీధిలోని ప్రజలు ఇంటింటికి చెత్త సేకరించే ఆటోలు రాకపోవడంతో చెత్తను తెచ్చి పడేసి పోవడంతో చెత్తంతా రోడ్ల మయమై కాలువల్లో నిండిపోయి కాలువల్లో నీరు ప్రవహించకుండా దోమలు ఎక్కువయ్యాయి. దోమలకు ఇండ్లలో ఉండలేకపోతున్నామని, మలేరియా లాంటి జ్వరాలు వచ్చే పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి చెత్తను వెంటనే తొలగించాలని ప్రజల ఆరోగ్యాలు కాపాడాలి.

వీధుల్లో తిరగలేకున్నాం : ఎల్లమ్మ, గౌలి గేరి



ఇంటింటికి తడిపడి చెత్త తీసుకు వెళ్లే ఆటోలు రాకపోవడంతో ప్రజలు ఇండ్లలోని చెత్తనంతా తెచ్చి వీధుల్లో పడేయడంతో రోడ్ల పైన తిరగలేని పరిస్థితి నెలకొంది. పందులు కుక్కలు సంచరిస్తూ వాటిలో ఉన్న ఆహారాన్ని తినే ప్రయత్నంలో చెత్త కాలువలో పడుతుంది. కార్మికులు చెత్తను తీసుకుపోయే వారు లేకపోవడంతో వీధులన్నీ వాసనతో ,దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలి

- సిఐటియు ఎఐటియుసి నాయకుల డిమాండ్
- మొద్దు నిద్రతో నిరసన తెలిపిన అంగన్వాడీలు
- 26వ రోజుకొనసాగిన సమ్మె

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

కర్నూలులో మొద్దు నిద్ర పోతున్న ప్రభుత్వం అంటూ వినూత్న రీతిలో శిబిరంలో నిద్రపోతు అంగన్వాడీలు నిరసన తెలిపారు. అంగన్వాడీలు చేస్తున్న సమ్మె 26వ రోజుకు చేరుకుంది. కర్నూలు ధర్నా చౌక్ శిబిరంలో అంగన్వాడీలు వినూత్న తరహాలో శిబిరంలో నిద్రపోతూ నిద్రపోతున్న ప్రభుత్వం నిద్రలేచి మా సమస్యలను పరిష్కరించాల ని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భం గా సిఐటియు నగర ఉపాధ్యక్షులు కె.సుధాకరప్ప, ఎఐటియుసి నగర అధ్యక్షులు రామాంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్ జిల్లా గౌరవాధ్యక్షులు పి.నిర్మల, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, సిఐటియు జిల్లా నాయకులు ఎం.గోపాల్ మాట్లాడారు. గత 25 రోజులుగా రాష్ట్రంలో లక్ష ఆరు మంది అంగన్వాడీలు తమ వేతనాల పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ,రూ. 5 లక్షలు ఇవ్వాలని ఇతర సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి ఎటువంటి ఆటంకాలు కల్పించకుండా న్యాయబద్ధంగా సమ్మె నోటీసు ఇచ్చి నిరసనలు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వానికి ఏ మాత్రం చలనం లేకుండా మహిళలు అనే కనికరం చూడకుండా నిర్ధాక్షిణ్యంగా సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి అనేక అస్త్ర శస్త్ర ప్రయోగాలు చేసి నిర్బంధాలు కొనసాగిస్తుందన్నారు. చివరకు మహిళలపై పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం వేసినట్లు అత్యవసర సేవల కింద చీకటి జిఓ 2 ను తీసుకుని వచ్చి ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తామని చెప్పడం ప్రభుత్వం చేతకానితనానికి నిదర్శనమని తెలిపారు. సమ్మెలు చేయరాదని వెంటనే విధులకు హాజరు కావాలని షరతులు పెట్టి మహిళలను వేధించడం సరైన పద్ధతి కాదని వారు విమర్శించారు. తమిళనాడు ప్రభుత్వం ఉద్యోగులపై ఎస్మా చట్టం ప్రయోగించి న్యాయస్థానాల తీర్పుతో జయలలితను మట్టి కరిచిందని, అదే తరహాలో జగన్మోహన్ రెడ్డి కూడా నిర్బంధాలు ప్రయోగిస్తే రాబోయే కాలంలో పరాభవం తప్పదని హెచ్చరించారు. నిర్బంధాలకు అంగన్వాడీలు భయపడరని సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. ఎపి రజక వత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.గురు శేఖర్, జిల్లా కార్యదర్శి ముక్కన్న, నగర కార్యదర్శి సి.శేషాద్రి బృందంతో వచ్చి అంగన్వాడీలకు మద్దతు తెలిపారు. ఎంఆర్‌పిఎస్ కళాకారుల బృందం శిబిరం వద్దకు వచ్చి తమ పాటలతో అంగన్వాడీలను ఉత్సాహపరిచారు. కళాకారులు సంఘీభావం తెలిపారు. సిఐటియు నగర నాయకులు ఎస్.మహమ్మద్ రఫీ, ఎఐటిసి కె. చంద్రశేఖర్ అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి రేణుక , టీచర్లు,ఆయాలు పాల్గొన్నారు.

ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించాలి

- కలెక్టర్ డాక్టర్ సృజన, ఎస్‌పి కృష్ణకాంత్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రామన్న సార్వత్రిక ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించాలని కలెక్టర్, ఎన్నికల అధికారి డాక్టర్ సృజన, జిల్లా ఎస్‌పి కృష్ణ కాంత్ అధికారులను కోరారు. శనివారం నగర శివారులోని పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై ఎన్నికలనోడల్ అధికారులు , పోలీస్ అధికారులతో కలెక్టర్, ఎస్‌పి సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీస్ ఆఫీసర్లను ఇంత ముందుగా ఎందుకు నియమించామంటే పోలింగ్ స్టేషన్లలో నిర్దేశించిన కనీస సౌకర్యాల ఏర్పాటు, వల్నరబిలిటీ మ్యాపింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి సెక్టార్ అధికారి పరిధిలో 13 నుండి 14 పోలింగ్ స్టేషన్లలో ఉండవచ్చున్నారు. వీటిలో కనీస సౌకర్యాలు ఉన్నాయా లేదా సెక్టర్ అధికారి సెక్టార్ పోలీస్ ఆఫీసర్ ఇద్దరు కలిసి పరిశీలించాలన్నారు. పోలింగ్ స్టేషన్‌లో తాగునీరు, ర్యాంపు, ఫర్నిచర్, విద్యుత్తు, టాయిలెట్స్ తప్పనిసరిగా పోలింగ్ రోజు తీసుకోవలసిన విధులను కూడా జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. ఎక్కడైనా అవసరమైనపుడు రీప్లేస్‌మెంట్ కోసం రిజర్వ్‌లో ఉన్న ఇవిఎంలను, వివిప్యాట్ లను తీసుకు వెళ్లేటప్పుడు ఎక్కడంటే అక్కడ వదిలి వేయకూడదని, వాటిని సెక్టార్ ఆఫీసర్ కస్టడీలోనే ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. సెక్టార్ ఆఫీసర్లు హ్యాండ్‌బుక్కును, వల్నరబులిటి హ్యాండ్ బుక్ లను కచ్చితంగా చదవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎస్‌పి జి.కృష్ణకాంత్ మాట్లాడుతూ ఎన్నికల్లో సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీసు ఆఫీసర్ల పాత్ర చాలా కీలకంగా ఉంటుందన్నారు. సెక్టార్ ఆఫీసర్లు ఇచ్చే సమాచారం ఆధారంగా నిర్ణయం తీసుకోవాలన్నారు. ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఒ మధుసూదన్ రావు, కర్నూలు ఆర్‌డిఒ హరిప్రసాద్, పత్తికొండ ఆర్‌డిఒ రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన

నూతన ఆశలతో...

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

నూతన ఆశలతో నూతన సంవత్సరం ప్రారంభమైంది. గడియారంలో చిన్న ముళ్ళు, పెద్ద ముళ్ళు రెండు 12 వద్దకు చేరుకున్నాయి. ఒక్క సారిగా 'విష్ యు హ్యాపీ న్యూ ఇయర్' అనే కేరింతలు ఆకాశాన్ని అంటాయి. యువత, పిల్లలు అందరూ నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. కేక్‌లను కట్ చేస్తూ వేడుకలను జరుపుకున్నారు. ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు. క్రైస్తవులు సాయంత్రం నుంచి చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ప్రజా ప్రతినిధులకు, అధికారులకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. పలు సంస్థల, సంఘాల క్యాలెండర్లు, డైరీలను అధికారులు, ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. ప్రజాశక్తి క్యాలెండర్‌ను, డైరీని పలువురు ప్రముఖులు ఆవిష్కరించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా యువత మద్యం మత్తులో మునిగితేలారు. మద్యం ఏరులై పారింది. జిల్లావ్యాప్తంగా ఒక్కరోజే రూ.6 కోట్ల మద్యం విక్రయాలు సాగినట్లు సమాచారం.

ఎన్నికల బదిలీలు...

త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలీసు శాఖ బదిలీలకు సన్నద్ధమవుతోంది. మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న పోలీసు అధికారులకు స్థాన చలనం కలిగించనున్నారు. ఎస్ఐలు మరో సబ్ డివిజన్, సిఐ స్థాయి మొదలుకొని అదనపు ఎస్పీ స్థాయి అధికారులు మరో జిల్లాకు బదిలీకానున్నారు. ఎన్నికల బదిలీ ప్రక్రియపై కర్నూలు రేంజ్ డిఐజి సెంథిల్ కుమార్ ఇటీవల నాలుగు జిల్లాల ఎస్పీలతో సమావేశం నిర్వహించి పలు సూచనలిచ్చారు. మూడేళ్లు పూర్తి చేసుకున్న సిఐ, ఎస్ఐలను బదిలీ చేయడంతో పాటు గత ఎన్నికల్లో ఆరోపణలు ఎదుర్కొన్న పోలీసు అధికారులను లూప్‌లైన్ స్థానాలకు పంపనున్నారు. డిప్యూటేషన్లపై వేర్వేరు పోలీసు స్టేషన్లలో పని చేస్తున్న సిబ్బందిని మాతృస్టేషన్లకు పంపనున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 8 సబ్ డివిజన్లలో 20 సర్కిళ్లు, 86 పోలీసు స్టేషన్లు ఉన్నాయి. ఇందులో లా ఆండ్ ఆర్డర్ పోలీసు స్టేషన్లు 82 ఉన్నాయి. మొత్తం 40 మంది సిఐలు, 90 మంది ఎస్ఐలు ఉన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో నంద్యాల జిల్లాకు చెందిన పోలీసు అధికారులంతా కర్నూలు జిల్లాలో పని చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే పలువురు సిఐలు ఎన్నికల నిబంధనలను దృష్టిలో ఉంచుకుని బదిలీ చేయించుకుని వెళ్లిపోతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో మొత్తం 10 మంది సిఐలు, 46 మంది ఎస్ఐలకు స్థాన చలనం కలుగనున్నట్లు తెలిసింది. ఎన్నికల నాటికి ఎన్నికల కమిషన్ నిబంధనల్లో మార్పులు చేసే అవకాశముందని పోలీసు అధికారులు భావిస్తున్నారు. మూడేళ్లు పూర్తి చేసుకున్న అధికారులు పక్క జిల్లాలో స్థానం కోసం అన్వేషణ మొదలు పెట్టారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు తెలివిగా ముందుగా పొరుగు జిల్లాలో పని చేసి ఎన్నికల సమయానికి తిరిగి తాము కోరుకున్న జిల్లాకు వచ్చే అవకాశం ఉంది.





క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎపి రజక వృత్తిదారుల సంఘం నాయకులు

రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి

ఎపి రజక వృత్తిదారుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆంధ్రప్రదేశ్ రజక వత్తిదారుల సంఘం 2024 క్యాలెండర్ ఆవిష్కరణ కర్నూలు కార్మిక కర్షక భవనంలో సి.శేషాద్రి అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఆంధ్రప్రదేశ్ రజకవత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.గురు శేఖర్, జిల్లా అధ్యక్షుడు సి.ముక్కన్న మాట్లాడుతూ రాష్ట్రంలో రజకులకు సామాజిక భద్రత లేదన్నారు. రజకులపై దాడులు మహిళలు, బాలికలపై అత్యాచారాలు నేటికీ కొనసాగుతున్నాయన్నారు. వాటిని అరికట్టేందుకు ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ మాదిరిగా సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలన్నారు. రజకుల సంక్షేమానికి వచ్చే బడ్జెట్‌లో కనీసం రూ.1000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రజక వత్తిదారులకు కార్పొరేషన్ ద్వారా 90 శాతం సబ్సిడీతో ప్రతి కుటుంబానికి వృత్తి నైపుణ్యం పెంచుకునేందుకు కుటుంబాల అభివృద్ధి చెందేందుకు రూ.లక్ష రుణాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమం లో కర్నూల్ ఓల్డ్ సిటీ కార్యదర్శి సి.హెచ్. శ్రీనివాసులు, అధ్యక్షురాలు జయమ్మ, న్యూ సిటీ అధ్యక్షుడు సి.రాముడు, శేఖర్ బాబు, నంద్యాల జిల్లా కన్వీనర్ వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు ఎల్లయ్య. హోళగుంద నాగరాజు.ఆదోని చిదానంద. బేళగల్ రామకృష్ణ, ఆయా మండలాలనుంచి నాయకులు పాల్గొన్నారు.



వృత్తి విద్యలో నైపుణ్యం పెంచుకోవాలి

జడ్‌పి హై స్కూల్ హెచ్‌ఎం ఎం. లీలావతి

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

వత్తి విద్యను అభ్యసించే విద్యార్థులు పరిశ్రమలను సందర్శించుట ద్వారా నైపుణ్యాన్ని పెంచుకోవచ్చని ఉలిందకొండ జడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం. లీలావతి అన్నారు. శనివారం ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా వృత్తి విద్యా విద్యార్థులు స్థానిక బిట్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా బిట్స్ కాలేజీ ప్రిన్సిపల్ గిరీష్ రెడ్డి విద్యార్థులను, వారికి శిక్షణను ఇచ్చిన ట్రైనర్స్ రెడ్డిపోగు మోజస్ (ఐటి), కుమార్ నాయక్ (ఎలక్ట్రానిక్స్)లను అభినందించారు. ఇలాంటి విజిట్‌లు వృత్తిలో స్థిర పడడానికి తోడ్పడతాయన్నారు. ఈ ఇండస్ట్రియల్ విజిట్‌లో జడ్‌పి హై స్కూల్ స్టాఫ్, విద్యార్థులు పాల్గన్నారు.

ఉరి తాళ్లతో క్లాప్ డ్రైవర్ల నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ క్లాప్ డ్రైవర్ల సమ్మె 21వ రోజున శనివారం కార్మికులు ఉరి తాళ్లను మెడకు బిగించుకుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి ఓల్డ్ సిటీ సిఐటియు నగర అధ్యక్షులు డి.అబ్దుల్ దేశాయ్ అధ్యక్షత వహించారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కోశాధికారి జె.దివాకర్, సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు ఓల్డ్ సిటీ నగర నాయకులు విజయ్ రామాంజనేయులు, కార్మికులను ఉద్దేశించిమాట్లాడుతూ 21 రోజులుగా వివిధ రూపాల్లో నిరసన తెలిపినా ప్రభుత్వం స్పందించక పోవడం దుర్మార్గమన్నారు. పెండింగ్ లో ఉన్న 6 నుండి12నెలల జీతాలు ఇవ్వాలని, ఇఎస్ఐ,పిఎఫ్ అమలు చేయాలని, పనిభద్రత కల్పించి వీక్లీ ఆఫ్‌లు, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. అగ్రిమెంట్ ప్రకారం రూ.18,500 జీతం ఇవ్వాలని, న్యాయమైన డిమాండ్లతో సమ్మె చేస్తుంటే అధికారులు , ప్రజాప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోకపోవడం సరైంది కాదన్నారు. కర్నూలు నగరంలో ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయి గుట్టలు గుట్టలుగా దర్శనమిస్తుందన్నారు.గాలికి చెత్తంతా డ్రైనేజీకాలువలో పడిమురిగిపోయి దుర్గంధ వాసనతో దోమలకు నిలయాలుగా మారాయన్నారు. దోమలు పెరిగి పెరిగిపోయి విషజ్వరాల బారిన ప్రజలు పడే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే క్లాప్ ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించి నగరాన్ని స్వచ్ఛ నగరంగా చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు ఓల్డ్ సిటీ ఆటో యూనియన్ నగర నాయకులు కుమార్, క్లాప్ డ్రైవర్ యూనియన్ నాయకులు రఘుశేఖర్, నరేష్, ఇస్మాయిల్ నవీన్, బాబ్జి, పరమేష్ చంద్రశేఖర్, పాల్గొన్నారు.



కర్నూలులో ఉరితాళ్లతో నిససన తెలుపుతున్న క్లాప్ డ్రైవర్లు

గూడూరులో వంట వార్పు

గూడూరు: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారానికి చేపట్టిన సమ్మె గూడూరులో సిఐటియు ఆధ్వర్యంలో 12 వ రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరంలో మున్సిపల్ కార్మికులు వంటా,వార్పు కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మెకు ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు సంఘీభావం తెలిపారు.

ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ మాట్లాడుతూ.... పట్టణాలను పరిశుభ్రంగా ఉంచి ప్రజలను అంటురోగాల భారీ నుండి కాపాడే పారిశుధ్య కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు ఉండి గుడ్డివాని లాగా వివరిస్తున్నదన్నారు. సిఐటియు డివిజన్ కార్యదర్శి జె.మోహన్, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు శాంతన్న, మనోహరమ్మ, లక్ష్మీదేవి, సూర్య శేఖర్, గోపాల్, అచ్చమ్మ, గ్రేసమ్మ, దుర్గ పాల్గొన్నారు.




రైతాంగ ఉద్యమాల వేగుచుక్క ఎపిరైతుసంఘం

రాజకీయాలతో సంబంధం లేకుండా సభ్యులుగా చేరండి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రైతాంగ సమస్యలపై రాజీలేని పోరాటం నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘంలో రైతులందరూ విరివిగా చేరాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈనెల నుంచి 10వరకు సభ్యత్వ క్యాంపెయిన్ ఉంటుందని, రాజకీయాలతో సంబంధం లేకుండా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘంను బలపరచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. శనివారం ఉలిందకొండ గ్రామంలో సంఘం సభ్యత్వం కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ మాట్లారు. దేశవ్యాప్తంగా నరేంద్ర మోడీ పాలనా విధానాలకు ప్రశ్నించాలని, రైతులకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని చేసి సుదీర్ఘ పోరాటాన్ని వివరించారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పాలన ఏమాత్రం రైతులకు అనుకూలంగా లేదని, కరువు నుండి రైతులను ఆదుకోవడంలో, ప్రకతి వైపరీత్యాల సందర్భంగా రైతులను ఆదుకోవడంలో ఇన్పుట్ సబ్సిడీ ఇన్సూరెన్స్ రైతు భరోసా గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయని విమర్శించారు. ఈ సమస్యలపై రైతులందరూ సంఘటితం కావాల్సిన అవసరం ఉందని అన్నారు. శనివారం ఆదోనిలో సభ్యత్వ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కౌతాళంలో జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య ఎమ్మిగనూరులో హనుమంతు, ఆస్పరిలో పి.హనుమంతు, రంగస్వామి, పత్తికొండలో రంగారెడ్డి సిద్దయ్య గౌడ్, తుగ్గలిలో శ్రీను, కొండారెడ్డి, దేవనకొండలో సూరి, శ్రీరాములు, బడే సాహెబ్, కల్లూరు మండలం, కర్నూలు, ఓర్వకల్లు మండలం ఎ.కృష్ణ, మధుసూదన్, ఆంజనేయులు మృత్యుంజయ , జిల్లా కమిటీ సభ్యులు, మండల నాయకులు పాల్గొన్నారు.



రైతులతో సభ్యత్వం చేయిస్తున్న జి.రామకృష్ణ



క్రీడాకారులతో మాట్లాడుతున్న కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

క్రీడాకారులను ప్రోత్సహించడం ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. నగరంలోని ఉస్మానియా కాలేజ్ మైదానంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ,వార్డ్ స్థాయి నుంచి వారిలోని నైపుణ్యాన్ని వెలికితేయడమే ఆడుదాం - ఆంధ్ర ముఖ్య ఉద్దేశమన్నారు. జగనన్న ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం - ఆంధ్ర కార్యక్రమంలో క్రీడాకారులందరూ శ్రద్ధతో పాల్గొని ఫిబ్రవరి 10న విశాఖపట్నంలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో కర్నూలు యువతీ యువకులు అత్యధిక స్థాయిలో పాల్గొనాలని కోరారు. కార్పొరేటర్లు అర్షియా పర్వీన్, జుబేర్ అహ్మద్, యూనుస్‌బాష, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఎడిగా శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



ఇటీవల సూపరిండెంట్‌గా పనిచేస్తూ పదోన్నతి పొందిన శ్రీనివాసులు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఇడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం డిఇఒ కార్యాలయంలో ఆయన తన చాంబర్‌లో బాధ్యతలను స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది ఉద్యోగుల సహకారంతో విధులను నిర్వహిస్తారని పేర్కొన్నారు.



మైపర్ అధ్యాపకునికి డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని మైపర్ ఫార్మసి కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కాసర్ల సురేష్‌కు శనివారం జెఎన్‌టియు అనంతపూర్ వైస్ ఛాన్సలర్ డాక్టరేట్ ఒరిజినల్ డిగ్రీ, 13వ కాన్వకేషన్ సందర్భంగా పిహెచ్‌డి డిగ్రీ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మైపర్ ఫార్మసీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ , అధ్యాపకునికి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ స్టెల్లా సతీష్, ప్రిన్సిపల్ డాక్టర్ జె.రవి కుమార్ రెడ్డి , అధ్యాపకులు అభినందించారు.

దాత ప్రసాద్ సహకారంతో తాగునీటి ట్యాంకు ప్రారంభం

- హాజరైన డిఇఒ రంగారెడ్డి

ప్రజాశక్తి - హొళగుంద



దాతను సన్మానిస్తున్న డిఇఒ, అధికారులు

విద్యార్థుల తాగునీటి కష్టాన్ని గుర్తించిన మిక్కిలినేని వెంకట శివప్రసాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం రూ.2.50 లక్షల వెచ్చించి తాగునీటి ట్యాంకు నిర్మాణం చేపట్టి ప్రజల మన్ననలు పొందారు. శనివారం ట్యాంకు ప్రారంభోత్సవం చేపట్టారు. డిఇఒ డాక్టర్ రంగారెడ్డి, ఆదోని డిప్యూటీ డిఇఒ రమణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ సేవాగుణం అవసరమని, విద్యార్థుల తాగునీటి కష్టాన్ని గుర్తించిన శివ ప్రసాద్ విద్యార్థుల కోసం తాగునీటి ట్యాంకు నిర్మించడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. అనంతరం దాత శివప్రసాద్ మాట్లాడారు. భవిష్యత్తులో మరెన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులను ప్రోత్సహించడం కోసం మొదటి బహుమతి కింద రూ.50 వేలు, రెండో బహుమతి కింద రూ.15 వేలు, మూడో బహుమతి కింద రూ.10 వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. విద్యార్థుల కోసం తన సొంత ఖర్చులతో భోజనాలను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షులు పి.శ్రీనివాసులు యాదవ్, ఎంఇఒలు సత్యనారాయణ, జగన్నాథం, ఎస్‌బిఐ మేనేజర్ రామ్మోహన్, యంగ్ డైనమిక్ సేవా ప్రదాత షబ్బీర్ సాహెబ్, పాఠశాల కమిటీ ఛైర్మన్ సిద్ధయ్య, ప్రధానోపాధ్యాయులు నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

గార్లదిన్నెలో విద్యార్థుల వినూత్న నిరసన

- ఉపాధ్యాయులను నియమించాలని కుక్కలకు వినతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



కుక్కకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

మండలంలోని గార్లదిన్నె గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు వినూత్న నిరసన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ శనివారం మండలంలోని గార్లదిన్నెలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కుక్కలకు వినతిపత్రం అందజేశారు. గార్లదిన్నె ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరు. అనేకసార్లు జిల్లా, మండల విద్యాధికారులకు మొర పెట్టుకున్నా ఫలితం లేదు. కుక్కలకు వినతిపత్రం ఇచ్చామని గ్రామస్థులు, విద్యార్థులు తెలిపారు. కేవలం ఒక్క ఉపాధ్యాయుని డిప్యూటేషన్ కింద వేశారు. ఆ ఉపాధ్యాయుడు ఏ తరగతి విద్యార్థులకు క్లాసులు బోధించాలి, ఎవరికి చెప్పకూడదో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయుల నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

- ఎర్రకోట నుంచి పార్టీలో చేరిన యువకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

నియోజకవర్గంలో వైసిపి నుంచి టిడిపిలోకి పలువురు చేశారు. శనివారం మండలంలోని ఎర్రకోట గ్రామానికి చెందిన ఈడిగ నరసింహులు, శ్రీరాములు, శ్రీనివాసులు, బాలు, రాజు, హరికృష్ణ, శివ, రవి, నరసింహులు, బాలుతో మరో 50 మంది మాజీ ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. పార్టీలో చేరిన వారికి బీవీ కండువా వేసి ఆహ్వానించారు. ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి స్వగ్రామం ఎర్రకోట నుంచి టిడిపిలో చేరడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటి వరకు ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డిని కాదని ఎర్రకోట గ్రామస్తులు వేరే రాజకీయ పార్టీలోకి వెళ్లలేదు. ప్రస్తుతం ఎర్రకోట నుంచి టిడిపిలో చేరడంతో తీవ్ర చర్చ జరుగుతోంది. అలాగే నందవరం మండలం హాలహర్వి గ్రామానికి చెందిన ముస్లింలు ఖాజా, బకాష్, రసూల్, డాక్టర్ బాషా, పెద్దమాబు, బడేసాబ్, చిన్న మాబు, చాంద్ బాషా, మునాఫ్, ఖాసీమ్, వలీ, గని, గౌస్, జబ్బార్, మహ్మద్‌తో పాటు చాకలి నరసప్ప, హరికృష్ణ మరో 50 మంది టిడిపిలో చేరారు. మాజీ ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి సమక్షంలో రైస్ మిల్ నారాయణ రెడ్డి అధ్వర్యంలో చేరారు.

వాగ్దేవి పాఠశాలలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలోని వాగ్దేవి పాఠశాలలో ముందస్తు సంక్రాంతి పండగ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సురేష్ ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రేణుక, శ్వేతబాయి హాజరై ముగ్గుల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులు మధు, శిరీష, అశ్విని, నవ్య, సంధ్య, బిందు, ద్రాక్షవేణి పాల్గొన్నారు.

అంగన్వాడీలపై 'ఎస్మా' ప్రయోగం మూర్ఖత్వం

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి - మంత్రాలయం

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించలేని వైసిపి ప్రభుత్వం వారిపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం మూర్ఖత్వమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.డి.అంజిబాబు విమర్శించారు. శనివారం పట్టణంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం నుంచి మండల ప్రజా పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీతో ప్రదర్శన నిర్వహించారు. ఎంపిపి గిరిజమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ గత 26 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. వెంటనే చర్చలు జరిపి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయాలని, వారి సేవలకు గుర్తింపుగా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీని అమలు చేయాలని కోరారు. ఇబ్బందులు ఎదుర్కొంటున్న అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకపోగా జిఒ 33 తెచ్చి ఎస్మా చట్టం కింద సమ్మె చెల్లదని చెప్పడం విడ్డూరంగా ఉందని తెలిపారు. నీరు, పాలు, విద్యుత్ లాంటివి వాటికి మాత్రమే ఎస్మా చట్టం వర్తిస్తుందని, అంగన్వాడీలు చేస్తున్న సేవలకు అది వర్తించదని చెప్పారు. ప్రభుత్వం అంగన్వాడీల సమ్మెను ఎంత విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నిస్తే అంత ఉధృతంగా కొనసాగిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగి వచ్చి సమస్యలను పరిష్కరించాలని కోరారు. వైసిపి మండల ఇన్‌ఛార్జి విశ్వనాథరెడ్డి, వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, సర్పంచి భీమయ్య, 52 బసాపురం సర్పంచి రాఘవరెడ్డి, ఎంపిడిఒ మణిమంజరి, సిఐటియు మండల కార్యదర్శి హెచ్.జయరాజు, నాయకులు ప్రాణేష్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు విశాలాక్షి, భీమేశ్వరి, ద్రాక్షాయిని, ఉమా మహేశ్వరి, సుజాత, ప్రమీల, లావణ్య ఉన్నారు.



కౌతాళంలో

కౌతాళంలో అంగన్వాడీల సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.ఎస్.రాధాకృష్ణ మాట్లాడారు. అంగన్వాడీ వేతనాలు పెంచకపోతే విజయవాడలోని ముఖ్యమంత్రి ప్యాలెస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. 26 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయమని కోరితే ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. కౌతాళంలో మారుమూల గ్రామాల వారు సైతం ఎవరికీ భయపడకుండా సమ్మెలో పాల్గొనడం గర్వించదగ్గ విషయమన్నారు. ఇక్కడ కూడా కొంతమంది అంగన్వాడీలను భయపెట్టించాలని చూసినా అంగన్వాడీలు భయపడకుండా ధైర్యంగా వారికి బుద్ధి చెప్పారని తెలిపారు. ప్రాజెక్టు ఉపాధ్యక్షులు విజయలక్ష్మి, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.మల్లయ్య, మండల కార్యదర్శి మేళిగిరి ఈరన్న, సిఐటియు కోసిగి రాముడు పాల్గొన్నారు. **ఆదోని**లోని అంబేద్కర్ విగ్రహం వద్ద వరలక్ష్మి అధ్యక్షతన రిలే దీక్షలు చేపట్టారు. సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, పిఎస్.గోపాల్, మండల అధ్యక్షులు రామాంజనేయులు, ఎఐటియుసి నాయకులు వీరేష్, విజయ్ మాట్లాడారు. దీక్షల్లో పద్మమ్మ, ధనలక్ష్మి, సోమక్క, కరుణ, రేణుక, జానకి, విజయ, ఈరమ్మ కూర్చున్నారు. అంగన్వాడీలు సరోజ, గీత, మీనా కుమారి, రిజ్వానా, సోమేశ్వరి, శారద పాల్గొన్నారు. **ఆలూరు**లో 26వ రోజు అంగన్వాడీలు తమ చెప్పులతో తామే కొట్టుకుంటూ నిరసన చేపట్టారు. 'ముఖ్యమంత్రి జగన్‌కు ఓట్లు వేసి గెలిపించినందుకు మా చెప్పులతో మేమే కొట్టుకుంటున్నామ'ని అంగన్వాడీ యూనియన్ నాయకులు జయశ్రీ, భారతి, పుష్పవతి ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి సిపిఎం నాయకులు కెపి.నారాయణస్వామి, షాకీర్, కృష్ణ, డివైఎఫ్ఐ నాయకులు మైనా, రైతుసంఘం నాయకులు వెంకటేశ్వర్లు మద్దతు తెలిపారు. అంగన్వాడీ నాయకులు లక్ష్మీ, సరస్వతి, ప్రభావతి, సుజాత, వెంకటలక్ష్మి పాల్గొన్నారు. **ఆస్పరి**లో అంగన్వాడీ సమ్మెలో పాల్గొని సిఐటియు జిల్లా సీనియర్ నాయకులు బి.రామాంజనేయులు, జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణస్వామి మాట్లాడారు. సిపిఎం ఆలూరు మండల కార్యదర్శి షాకీర్ బాషా, మల్లేష్ మద్దతు తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి హనుమంతు, సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి, సిపిఎం, సిపిఐ ప్రజాసంఘాల నాయకులు రంగస్వామి, సిఐటియు మండల కార్యదర్శి రామాంజనేయులు, నరేంద్ర, రామాంజనేయులు, రవి, ఆంజనేయ, ఉరుకుందప్ప పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు**లోని అంగన్వాడీ కేంద్రం ముందు ప్రభుత్వం జారీ చేసిన ఎస్మా చట్టం జిఒను దహనం చేశారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు గోవర్ధనమ్మ, నీరజ, బసమ్మ, శిరోమణి, నాగలక్ష్మి, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు సి.గోవిందు, బి.రాముడు, ఎఐటియుసి డివిజన్ నాయకులు తిమ్మ గురుడు, రంగన్న మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అబ్దుల్లా, కార్యదర్శి రంగప్ప, రైతుసంఘం నాయకులు సి.నరసింహులు మద్దతు ఇచ్చారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు కృష్ణ వేణి, నాగేశ్వరమ్మ, నీరజ, శైలజ, యుఎం.నాగలక్ష్మి, మల్లీశ్వరి, పుష్ప, పద్మలత, మేరీ, ప్రభావతి, శశికళ, ధన లక్ష్మి, సమంతకమణి, లక్ష్మి దేవి పాల్గొన్నారు. **దేవనకొండ** మండలంలోని తెర్నేకల్లు గ్రామంలో అంగన్వాడీ కేంద్రాలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేయడానికి డీలర్లు ప్రయత్నించగా అంగన్వాడలు అడ్డుకున్నారు. మండలంలోని పి.కోటకొండ గ్రామంలో అంగన్వాడీలు సచివాలయాన్ని ముట్టడించి తాళాలు వేశారు. దేవనకొండలో రెండు రోజులుగా ఆర్‌టిసి బస్టాండ్‌లో సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టారు. **పెద్దకడబూరు**లో తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని అంగన్వాడీలు ప్రార్థనలు చేశారు. స్థానిక దేవాలయంలో ప్రత్యేక పూజలు, మసీదులో, సిఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు జయమ్మ, చిట్టెమ్మ, సుకన్య, శారద, రత్నమ్మ, అరుణ పాల్గొన్నారు.



మంత్రాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



ఆలూరులో తమ చెప్పలతో తామే కొట్టుకుంటున్న అంగన్వాడీలు

ప్రజల పక్షపాతి ప్రజాశక్తి

- వైసిపి జిల్లా కోశాధికారి కొత్త కాపు మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి - దేవనకొండ

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సమస్యలను వెలికితీస్తున్న ప్రజాశక్తి ప్రజల పక్షపాతి అని వైసిపి జిల్లా కోశాధికారి కొత్త కాపు మధుసూదన్ రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని తెర్నేకల్ గ్రామంలో ప్రజాశక్తి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ప్రజాశక్తి విలేకరి కాశీం, ఎంపిటిసి నామాల శ్రీనివాసులు, ఉప సర్పంచి భర్త బెల్ ఈరన్న, వైసిపి నాయకులు దుమ్ము హనుమంతు, బడేసాబ్, పురుషోత్తమ రెడ్డి, గుర్రం స్వామి పాల్గొన్నారు.



ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మధుసూదన్ రెడ్డి

మానవత్వానికి మించిన మతం లేదు

- ఎఐసిసి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మానవత్వానికి మించిన మతం లేదని ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ (ఎఐసిసి) రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు తెలిపారు. పట్టణంలో క్రిస్టియన్ రిఫార్మ్‌డ్ చర్చ్ (సిఆర్‌సి) సంఘ స్థాపనలో, దినదినాభివృద్ధిలో పట్టణ ప్రముఖులు, హిందూ మతానికి చెందిన కీర్తిశేషులు గాలి గౌడ్, కీర్తిశేషులు డాక్టర్ ఖిబులా వీక్లీఫ్ ఆధ్వర్యంలో అందించిన సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. శనివారం పట్టణంలో సిఆర్‌సి చర్చి స్థాపించి 75 ఏళ్లు పూర్తి కావడంతో సంఘ సభ్యులు మూడు రోజులుగా చర్చి ఆవరణంలో వజ్రోత్సవ క్రైస్తవ మహోత్సవాలను నిర్వహించారు. సిఆర్‌సి సంఘ కాపరి రవితేజ అధ్యక్షతన జరిగిన వజ్రోత్సవ వేడుకల్లో దైవజనులు పిఎ.స్వామి వాక్యోపదేశం చేశారు. సీనియర్ పాస్టర్ జాషువా జోసెఫ్ ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు మాట్లాడారు. ఆరంభంలో కీర్తిశేషులు ఎస్ఐ ఎం.ఎ.జీవరత్నం, ఉపాధ్యాయులు గుర్రం మాణిక్యమ్మ, గుర్రం జకరయ్య, జోబులు సిఆర్‌సి చర్చి కోసం గాలి గౌడు ఇంటిని బాడుగకు తీసుకున్నారని తెలిపారు. అభివృద్ధి చెందడంతో డాక్టర్ ఖిబులా క్వార్టర్స్‌లో చర్చి కార్యక్రమాలను నిర్వహించారని గుర్తు చేశారు. సిఆర్‌సి చర్చి సంఘ పెద్దలు గాలి గౌడ్ కుమారుడు మల్లికార్జున గౌడ్‌ను, డాక్టర్ ఖిబులా మనువళ్లు కాంట్రాక్టర్ యూసుఫ్‌ను, మున్సిపల్ కౌన్సిలర్ ఇస్సాక్‌ను, రియల్ ఎస్టేట్ వ్యాపారి గోపిని, చర్చి కార్యక్రమాలను పర్యవేక్షించిన గురు వెంకట బద్రీనాథ్ స్వామిని శాలువాలు కప్పి, పూలమాలలు వేసి సన్మానించారు. సంఘ సభ్యులు గుర్రం దేవ ప్రసాద్, సాల్మన్, ఇశ్రాయేలు పాల్గొన్నారు.



అతిథులను సన్మానిస్తున్న సభ్యులు

మాటను నిలబెట్టుకునే నాయకుడు జగన్

- అబద్ధాలు చెప్పి మోసం చేసే నాయకుడు చంద్రబాబు

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునే నాయకుడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని, అబద్ధాలు చెప్పి ప్రజలకు మోసం చేసే నాయకుడు చంద్రబాబు అని, ప్రజలు ఇది గుర్తుంచుకోవాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పింఛన్ల పంపిణీకి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి చెందుతుందన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. గత టిడిపి ప్రభుత్వంలో రైతులకు రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇలా ఎన్నో హామీలు ఇచ్చి మోసం చేసిన ఘనత చంద్రబాబుది అని విమర్శించారు.



కౌతాళంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

రాంపురం రెడ్డి సోదరుల కుటుంబం నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, ఉరుకుంద ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ నాగరాజు గౌడ్, సీనియర్ నాయకులు లక్ష్మారెడ్డి, కో ఆప్షన్ సభ్యులు మాబు సాబ్, మాజీ సర్పంచి అవతారం కొనియాడారు. అనంతరం నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. ఎంపిపి అమ్రేష్, వైస్ ఎంపిపి బుజ్జిస్వామి, సర్పంచి పాల్ దినకరన్, వైస్ సర్పంచి తిక్కయ్య, నాయకులు గురునాథ్ రెడ్డి, సర్పంచులు గోపాల్ రెడ్డి, మహేష్, తోవి నరసప్ప పాల్గొన్నారు. **దేవనకొండ** మండల కార్యాలయ సమావేశ భవనంలో వైఎస్ఆర్ పెన్షన్ కానుకను లబ్ధిదారులకు అందజేశారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ సోదరులు గుమ్మనూరు నారాయణస్వామి, శ్రీనివాసులు, జడ్‌పిటిసి కిట్టు, ఎంపిపి భర్త లుముంబా, వైసిపి మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, తెర్నేకల్, అలారుదిన్నె సర్పంచలు అరుణ్ కుమార్, మల్లయ్య, వైసిపి నాయకులు దివాకర్ నాయుడు, రామచంద్ర, చంద్రన్న, ప్రేమ్ నాథ్ రెడ్డి, మదన్ మోహన్ రెడ్డి, కొత్తపేట బాబు, కరివేముల వీరేష్ పాల్గొన్నారు. **కోసిగి** మండంలోని అగసనూరులో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైసిపి మండల ఇన్‌ఛార్జీ మురళీమోహన్ రెడ్డి ఆదేశాల మేరకు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అగసనూరు మాజీ సర్పంచి ఆకాష్ రెడ్డి, వైసిపి నాయకులు అనుమప్ప, కర్రెప్ప, నరసయ్య, శివయ్య, వీరేష్, సతీష్, బాబు రెడ్డి, తిరుమల్ పాల్గొన్నారు.

సాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం : సిఐ

ప్రజాశక్తి - కోసిగి



కోసిగి సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉక్కుపాదం మోపుతామని సిఐ ప్రసాద్ హెచ్చరించారు. శనివారం సిఐగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయన కర్నూలు స్పెషల్ బ్రాంచి నుంచి కోసిగికి బదిలీపై వచ్చారు. కోసిగి సిఐగా పనిచేసిన ఎరిషా వలీ బదిలీపై మంత్రాలయం సిఐగా వెళ్లారు. కోసిగి ఎస్ఐ సతీష్ కుమార్, స్పెషల్ బ్రాంచి ఎఎస్ఐ విజయ్ కుమార్, మంత్రాలయం ఎస్ఐ వేణుగోపాల్ రాజులు స్వాగతం పలికారు.

బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా శివన్న

ప్రజాశక్తి - ఆదోని



రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్ రావు ఆదేశాల మేరకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గుడిసె శివన్నను నియమించినట్లు రాయలసీమ ఇన్‌ఛార్జీ నాగ శేషు యాదవ్ వెల్లడించారు. శనివారం ఆదోనిలో గుడిసె శివన్న మాట్లాడారు. జిల్లా అధ్యక్షులుగా ఉన్న తనను రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించడంతో రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీల అభివృద్ధి, ఐక్యత కోసం పని చేసి న్యాయం చేస్తానన్నారు.

36 గంటల ధర్నాను జయప్రదం చేయండి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఆదోని

ఆర్థిక బకాయిల సాధన కోసం యుటిఎఫ్ ఆధ్వర్యంలో 9, 10న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి 36 గంటల ధర్నాను జయప్రదం చేయాలని యుటిఎఫ్ ఆదోని రూరల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హుస్సేన్, వై.రామాంజనేయులు కోరారు. శనివారం ఆదోనిలోని ఓ పాఠశాలలో వారు మాట్లాడారు. పెండింగ్ పిఆర్‌సి, డిఎ అరియర్స్, ఎపి జిఎల్ఐ, సరెండర్ లీవ్స్, మెడికల్ బిల్లులు తదితర సుమారు రూ.18 వేల కోట్ల ఆర్థిక బకాయిల సాధనకు యుటిఎఫ్ చేపట్టిన దశలవారి పోరాటంలో భాగంగా నాలుగో దశ రాష్ట్ర కేంద్రంలో 36 గంటల ధర్నాకు పూనుకున్నామని తెలిపారు.

మున్సిపల్ కార్యాలయం ముట్టడి

- సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు నాయకుల అరెస్టు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శనివారం మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో 12వ రోజు సమ్మెలో భాగంగా పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని మున్సిపల్ కార్మికుల సమ్మె శిబిరం నుంచి ర్యాలీగా వెళ్లి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం ముందు బైఠాయించి, మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పెద్దఎత్తున ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో మున్సిపల్ కార్యాలయం దద్దరిల్లింది. మున్సిపల్ కమిషనర్, పోలీసు యంత్రాంగం వచ్చి కార్మికులు బయటకు వెళ్లాలని చెప్పడంతో కార్మికులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కార్మిక నాయకులను బలవంతంగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి రాముడు, ఎఐటియుసి తాలూకా సహాయ కార్యదర్శి జి.రంగన్న, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి మహేంద్ర మాట్లాడారు. మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేసి, క్లాప్ ఆటో డ్రైవర్లకు జిఒ 7 ప్రకారం రూ.18,500 వేతనం, కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేస్తూ కార్మిక హక్కులను కాలరాస్తోందన్నారు. ముఖ్యమంత్రి చర్చల్లో పాల్గొని చర్చలు సఫలం చేయాలని కోరారు. లేకపోతే దశలవారీగా సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు వీరేష్, విజయేంద్ర, మున్సిపల్ నాయకులు ఎల్లప్ప, శివ, లక్ష్మణ్, నాగప్ప, అల్లా బకాష్, తిక్కయ్య, రంగస్వామి, కేశన్న, రవి, ఈరన్న, ప్రతాప్, ఆరిఫ్, దేవపుత్ర పాల్గొన్నారు. **ఆదోని** పట్టణంలోని పంపు హౌస్ వద్ద 11వ రోజు ధర్నా కొనసాగించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.ఈరన్న, పట్టణ కార్యదర్శి పిఎస్.గోపాల్ పాల్గొన్నారు.



ఎమ్మిగనూరు కార్యాలయం ముందు బైఠాయించిన మున్సిపల్ కార్మికులు

వైసిపి టిక్కెట్ ఆశావహుల్లో మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి - దేవనకొండ

వైసిపి అధిష్టానం ఆలూరు ఎమ్మెల్యే స్థానానికి ఇప్పటివరకు అభ్యర్థిని ప్రకటించలేదు. ఆ టికెట్ ఆశించే ఆశావహుల్లో తెర్నేకల్ కొత్తకాపు మధుసూదన్ రెడ్డి ఒకరు. వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై తనదైన శైలిలో ఆలూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ప్రచారం చేస్తూ వైసిపి బలోపేతానికి కృషి చేస్తున్నారు. ఈ కోవలో ఎమ్మెల్యే అభ్యర్థికి పార్టీ అధిష్టానికి దరఖాస్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే టిక్కెట్ కోసం చివరి వరకు కృషి చేస్తున్నట్లు ఆయన వర్గీయుల ద్వారా సమాచారం. ఆలూరు టిక్కెట్ ఆశించే వారి సంఖ్య అధికమవడంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ టికెట్ కేటాయింపు మరి కొన్ని రోజులు ఆలస్యం అవుతున్నట్లు తెలిసింది.

జగన్‌కు బుద్ధి చెప్పాలి : టిడిపి

ప్రజాశక్తి - మంత్రాలయం

రాష్ట్రంలో నిరుద్యోగ యువతను వంచించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి తగిన బుద్ధి చెప్పాలని తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక పాత ఊరులో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి జనవరిలో జాబ్ క్యాలెండర్‌ను అమలు చేస్తామని చెప్పి నాలుగేళ్లుగా ఒక్క సచివాలయ ఉద్యోగాలు తప్ప ఇతర ఉద్యోగాలు భర్తీ చేయలేక పోయారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి కావడాన్ని ఎవరూ ఆపలేరని, నియోజకవర్గంలో టిడిపి ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తెలుగు యువత కార్యనిర్వహణ కార్యదర్శి పన్నగ నాగశయన స్వామి, మీడియా ఇన్‌ఛార్జీ విజయరామిరెడ్డి, ఎంపిటిసి నక్కి వెంకటేష్, వనికె నాగరాజు, హండే హనుమంతు, వట్టేప్ప గారి నరసింహ, గనేకంటి రఘు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి ఏబు, శివ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దివాకర్ రెడ్డి

మండలాభివృద్ధే లక్ష్యం : ఎంపిపి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండల అభివృద్ధే లక్ష్యంగా అధికారులు పని చేయాలని ఎంపిపి వై.గిరిజమ్మ తెలిపారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ మణిమంజరి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో మండలంలో వివిధ శాఖల ద్వారా జరిగిన అభివృద్ధి పనులను సంబంధిత అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఎంపిపి గిరిజమ్మ మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికే ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి నేతృత్వంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించి సమస్యలను పరిష్కరించేందుకు సుమారు రూ.8 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఉపాధి హామీ చట్టం కింద రూ.30 లక్షలతో మంత్రాలయం, సూగూరు, సింగరాజన్నహళ్లి, చౌటుపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేలో 20 గ్రామాలకు గాను 11 గ్రామాల్లో పూర్తయినట్లు చెప్పారు. సమస్యలున్న రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. త్వరలోనే 200 కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేస్తామని తెలిపారు. త్వరలో చేపట్టనున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' రెండో విడతను విజయవంతం చేసేందుకు గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, వాలంటీర్లు అవగాహన కల్పించాలని కోరారు. గత సర్వసభ్య సమావేశంలో కల్లుదేవకుంట గ్రామ సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తాగునీటి పైపులైన్ కావాలని కోరగా రూ.1.75 లక్షలతో పైపులైన్ వేసి నీటి సరఫరా చేయడంతో ఆ శాఖాధికారులు ఎంపిపికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మైదానం నుంచి ప్రత్యేక పైపులైన్, ఎంపిడిఒ కార్యాలయం వరకు మరమ్మతులు చేయడం అభినందనీయమని కొనియాడారు. వి.తిమ్మాపురం, వగరూరు గ్రామాల్లోని పలు కాలనీల్లో తాగునీటి సౌకర్యం కోసం నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. వాటిని ప్రజలకు వివరించి రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని గెలిపించాలని ప్రజా ప్రతినిధులను కోరారు. నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ సి.విశ్వనాథ్ రెడ్డి, వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, ఎంపిటిసి జి.వెంకటేష్, 52 బసాపురం సర్పంచి రాఘవరెడ్డి, చెట్నిహల్లి సర్పంచి బెస్త అంజినయ్య, ఎంపిటిసి రామాంజనేయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి గిరిజమ్మ

బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మంత్రాలయం

విద్యుదాఘాతంతో బంకు దగ్ధమై నష్టపోయిన బాధితునికి వైసిపి రాష్ట్ర యువ నేత వై.ప్రదీప్ రెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో ఇటీవల విద్యుదాఘాతంతో ఈడిగ గోపాల్ కిరాణషాపు పూర్తిగా కాలిపోయిన విషయం తెలుసుకున్న ప్రదీప్ రెడ్డి గ్రామానికి చేరుకుని గోపాల్‌కు ధైర్యం చెప్పి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు పట్టణంలోని భీమా నిలయంలో గోపాల్‌కు రూ 25 వేల నగదును అందజేశారు. భవిష్యత్తులో కూడా అండగా ఉంటామని, అధైర్య పడొద్దని భరోసా ఇచ్చారు. వైసిపి సేవాదళ్ నాయకులు బూదూరు లక్ష్మి నారాయణ రెడ్డి, సర్పంచి ముక్కరన్న ఉన్నారు.

ఇచ్చిన మాట మేరకు పింఛను పెంపు

పెద్దకడబూరు : ఇచ్చిన మాట మేరకు పింఛను రూ.3 వేలకు పెంచినట్లు వైసిపి రాష్ట్ర యువజన నాయకులు వై.ప్రదీప్ రెడ్డి తెలిపారు. పెద్దకడబూరులో 'గడప గడపకు మనం ప్రభుత్వం' నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న నవరత్నాలు ఎంతవరకు అందాయో తెలుసుకున్నారు. సమస్యలుంటే తమకు తెలపాలని కోరారు. వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పురుషోత్తం రెడ్డి, రాష్ట్ర రోడ్డు అభివద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపిపి రఘురాం, రవిచంద్ర రెడ్డి, నవీన్ రెడ్డి, సర్పంచి రామాంజనేయులు, ముక్కరన్న, అర్లప్ప, ఎంపిడిఒ ప్రభాకర్ పాల్గొన్నారు.

దేవనకొండలో దొంగతనం

- 8 తులాల బంగారు, 40 తులాల వెండి, రూ.29,500 నగదు చోరీ

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండలోని మాల వీధిలో ఆర్‌టిసి డ్రైవర్ మజీద్ ఇంట్లో శనివారం దొంగతనం జరిగింది. దొంగలు ఇంట్లోకి చొరబడి బీరువా తెరిచి రూ.29,500 నగదు, 8 తులాల బంగారు, 40 తులాల వెండిని అపహరించారు. పోలీసుల వివరాల మేరకు... చోరీకి గురైన ఇంట్లోని మహిళ పక్కింటి ఇంట్లోకి ఇంటి తలుపులు వేసి వెళ్లారు. దొంగలు ఇంట్లోకి ప్రవేశించి తాళాలు వేసిన బీరువాను తెరిచి దొంగతనానికి పాల్పడ్డారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చోరీ జరిగిన ఇంటిని ఎస్ఐ భూపాలుడు, పోలీసు సిబ్బంది పరిశీలించారు. దొంగల ఆచూకీ తెలుసుకోవడానికి క్లూస్ టీం డాగ్ స్క్వాడ్ రప్పించారు. చోరీ జరిగిన ప్రదేశంలో ఆధారాలను సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


వివాహ వేడుకలో నాయకుల సందడి

ప్రజాశక్తి - ఆదోని



తేజశ్రీ, వినోద్ రెడ్డిని ఆశీర్వదిస్తున్న మీనాక్షి నాయుడు

పట్టణంలోని రెడ్డీస్ హాస్టల్లో జరిగిన మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి కుమార్తె వివాహ వేడుకల్లో ఇరు పార్టీలకు చెందిన నాయకులు సందడి చేశారు. పట్టణంలోని భారత్ గ్యాస్ ప్రొప్రైటర్ మల్లికార్జున్ రెడ్డి కుమారుడు డాక్టర్ వినోద్ రెడ్డికి, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి కుమార్తె డాక్టర్ తేజశ్రీతో వివాహం శనివారం ఘనంగా జరిగింది. ఆదోని ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ శాంత, వైస్ ఛైర్మన్‌లు నరసింహులు, మహ్మద్ గౌస్, గుడిసె ఆది కృష్ణమ్మ, సూరం భాస్కర్ రెడ్డి, మాన్వి దేవేంద్రప్ప, సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, ఎఐటియుసి నాయకులు అజయ్ బాబు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

'ఎస్మా' హాస్యాస్పదం

- గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదు.. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు
- జిల్లా వ్యాప్తంగా 26వ రోజు అంగన్‌వాడీల సమ్మె
- నంద్యాలలో 24 గంటల రిలే నిరాహార దీక్ష - పలు చోట్ల జీవో 2 కాపీలు దగ్ధం
- మహానందిలో శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే మద్దతు



నంద్యాల జిల్లా కేంద్రంలో 24 గంటల నిరాహార దీక్షలో భాగంగా శిబిరంలోనే నిద్రిస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - విలేకరులు

నంద్యాల జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీల సమ్మె 26వ రోజు శనివారం కొనసాగింది. నంద్యాల జిల్లా కేంద్రంలో సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు 24 గంటల రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. కొత్తపల్లిలో అంగన్‌వాడీలు ఒంటి కాలితో నిలబడి దండం పెడుతూ నిరసన తెలిపారు. శ్రీశైలం మండలం సుండిపెంటలో అంగన్‌వాడీలు నినాదాలతో కూడిన క్యాపులను ధరించి నిరసన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జీవో నెంబర్ 2 కాపీలను దగ్ధం చేశారు.

నంద్యాల కలెక్టరేట్ : సమస్యలు పరిష్కరించాలని శాంతియుతంగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం హాస్యాస్పదంగా ఉందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు అన్నారు. సమ్మెలో భాగంగా 26వ శనివారం నంద్యాలలో అంగన్‌వాడీలు 24 గంటల రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షలను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు ప్రారంభించి మాట్లాడారు. అంగన్‌వాడీలు గత 25 రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. అంగన్వాడీల సమ్మె ఇతర సంఘాలు చేస్తున్న ఆందోళనకు స్ఫూర్తిదాయకమని అన్నారు. కనీస వేతనం రూ. 26 వేలు, విరమణ బెనిఫిట్స్ రూ. 5 లక్షలకు పెంచాలని అంగన్వాడీలు కోరుతుంటే అవి పరిష్కరించకుండా వయో పరిమితి పెంపు 60 నుండి 62 ఏళ్ల పెంచుతామని, విరమణ తరువాత 40 వేల నుండి లక్ష రూపాయలు అంగన్వాడీ కార్యకర్తలకు, ఆయాలకు రూ. 29 వేల నుండి 40 వేలు ఇస్తామంటూ చెప్పడం వల్ల అంగన్వాడీలకు ఒరిగేది ఏమి లేదన్నారు. శ్రామిక మహిళా సమన్వయ నాయకురాలు టి.నిర్మల మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యల పట్ల ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరైనది కాదన్నారు. ప్రభుత్వం తక్షణమే వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 24 గంటల రిలే నిరాహార దీక్షలలో **మిగతా 6వ పేజీలో...**

సిఎం నియంతృత్వానికి నిదర్శనం ఎస్మా : సిపిఎం

ప్రజాశక్తి - నంద్యాల

అంగన్వాడీల సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మాను ప్రయోగించడం నియంతృత్వానికి నిదర్శనమని సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్, పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించడానికి చేతకాక అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించి ప్రభుత్వం తమ చేతకానితనాన్ని నిరూపించుకుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వమే తెలంగాణ కంటే ఎక్కువగా వేతనాలు ఇస్తానని చెప్పి ఇప్పుడు మాట తప్పి, మడమతిప్పి సమ్మెపై నిర్బంధాన్ని ప్రయోగిస్తుందని పేర్కొన్నారు. సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు జీతాలు కూడా తగ్గించి కక్షపూరితమైన చర్యలకు ఈ ప్రభుత్వం పూనుకుంటుందని తెలిపారు. వైసిపి ప్రభుత్వానికి భవిష్యత్తులో అంగన్వాడీ కార్మికులు, వారికి మద్దతు ఇస్తున్న అన్ని రకాల ప్రజా సంఘాలు, ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. తక్షణమే ప్రభుత్వం ఎస్మాని ఎత్తివేసి అంగన్‌వాడీలతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టవలసి వస్తుందని హెచ్చరించారు.

పటిష్ట నిఘాకు చర్యలు

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి పటిష్ట నిఘాకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సరిహద్దు ప్రాంతాల్లో నిఘా కేంద్రాల ఏర్పాటుపై జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో శనివారం కలెక్టర్ ఛాంబర్లో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్లను ప్రభావితం చేసే మద్యం, నగదు, ఇతర గిఫ్ట్ పంపిణీ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి పటిష్ట నిఘా ఉంచేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం, డబ్బు వంటి వాటి అక్రమ రవాణాకు పాల్పడే వారిపై గట్టి నిఘా పెట్టి అడ్డుకట్ట వేసేందుకు సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల దృష్ట్యా జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో పటిష్ట నిఘా కేంద్రాలు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించేందుకు బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ బృందాల్లో పోలీస్, రెవెన్యూ, ఇన్కమ్ టాక్స్, కమర్షియల్ టాక్స్, బ్యాంక్ అధికారులు, ఎక్సైజ్, అటవీశాఖ అధికారులు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ బృందాలు 24 గంటలు సరిహద్దు ప్రాంతాల్లో నిరంతర నిఘా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్ అధికారులు అనుమానిత వ్యక్తులు, వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎటువంటి అక్రమ రవాణా చర్యలకు పాల్పడినట్లు అనుమానం వస్తే సంబంధిత వ్యక్తులను విచారించి, నిర్ధారణ అయితే తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నూతన ఆశలతో...

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

నూతన ఆశలతో నూతన సంవత్సరం ప్రారంభమైంది. గడియారంలో చిన్న ముళ్ళు, పెద్ద ముళ్ళు రెండు 12 వద్దకు చేరుకున్నాయి. ఒక్క సారిగా విష్ యు హ్యాపీ న్యూ ఇయర్ అనే కేరింతలు ఆకాశాన్ని అంటాయి. యువత, పిల్లలు అందరూ నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. కేక్‌లు కట్ చేస్తూ వేడుకలను జరుపుకున్నారు. ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు. క్రైస్తవులు సాయంత్రం నుంచి చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ప్రజా ప్రతినిధులకు, అధికారులకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. పలు సంస్థల, సంఘాల క్యాలెండర్లు, డైరీలను అధికారులు, ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. ప్రజాశక్తి క్యాలెండర్‌ను, డైరీని పలువురు ప్రముఖులు ఆవిష్కరించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా యువత మద్యం మత్తులో మునిగితేలారు. మద్యం ఏరులై పారింది. జిల్లా వ్యాప్తంగా ఒక్కరోజే రూ.6 కోట్ల మద్యం విక్రయాలు సాగినట్లు సమాచారం.

ఎన్నికల బదిలీలకు సన్నద్ధం...

త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలీస్ శాఖ బదిలీలకు సన్నద్ధమవుతోంది. మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న పోలీస్ అధికారులకు స్థాన చలనం కలిగించనున్నారు. ఎస్సైలు మరో సబ్ డివిజన్, సీఐ స్థాయి మొదలుకొని అదనపు ఎస్పీ స్థాయి అధికారులు మరో జిల్లాకు బదిలీ కానున్నారు. ఎన్నికల బదిలీ ప్రక్రియపై కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ ఇటీవల నాలుగు జిల్లాల ఎస్పీలతో సమావేశం నిర్వహించి పలు సూచనలిచ్చారు. మూడేళ్లు పూర్తి చేసుకున్న సీఐ, ఎస్సైలను బదిలీ చేయడంతో పాటు గత ఎన్నికల్లో ఆరోపణలు ఎదుర్కొన్న పోలీస్ అధికారులను లూప్‌లైన్ స్థానాలకు పంపనున్నారు. డిప్యుటేషన్లపై వేర్వేరు పోలీస్ స్టేషన్లలో పని చేస్తున్న పోలీస్ సిబ్బందిని మాతృస్టేషన్లకు పంపనున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 8 సబ్ డివిజన్లలో 20 సర్కిళ్లు, 86 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ఇందులో లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్లు 82 ఉన్నాయి. మొత్తం 40 మంది సిఐలు, 90 మంది ఎస్సైలు ఉన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో నంద్యాల జిల్లాకు చెందిన పోలీసు అధికారులంతా కర్నూలు జిల్లాలో పని చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే పలువురు సిఐలు ఎన్నికల నిబంధనలను దృష్టిలో ఉంచుకుని బదిలీ చేయించుకుని వెళ్లిపోతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో మొత్తం 10 మంది సిఐలు, 46 మంది ఎస్సైలకు స్థాన చలనం కలుగనున్నట్లు తెలిసింది. ఎన్నికల నాటికి ఎన్నికల కమిషన్ నిబంధనల్లో మార్పులు చేసే అవకాశముందని పోలీస్ అధికారులు భావిస్తున్నారు. మూడేళ్లు పూర్తి చేసుకున్న అధికారులు పక్క జిల్లాలో స్థానం కోసం అన్వేషణ మొదలు పెట్టారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు తెలివిగా ముందుగా పొరుగు జిల్లాలో పని చేసి ఎన్నికల సమయానికి తిరిగి తాము కోరుకున్న జిల్లాకు రావచ్చని ఆశిస్తున్నారు.



బెదిరించాలని చూస్తే సహించబోం

- సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకురాలు సుహాసిని

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఉద్యోగులను బెదిరించాలని చూస్తే సహించేది లేదని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకురాలు సుహాసిని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పినప్పటికీ ప్రభుత్వాలు మాత్రం వెట్టిచాకిరి చేయించుకుంటున్నాయని విమర్శించారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె శనివారం 18వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్ఎస్సిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని అడగడమే నేరంగా ఉన్నతాధికారులు వివరిస్తున్న తీరు బాధాకరమన్నారు. దేశ ప్రథమ మహిళా ఉపాధ్యాయురాలు జయంతి సందర్భంగా మహిళా ఉద్యోగులను అవమానించేలా ఎస్పిడి మాట్లాడిన మాటలు మహిళా ఉద్యోగులను బాధిస్తున్నా యన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు, కేజీబీవీ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర నాయకురాలు సుహాసిని

దేశ ఖ్యాతిని పెంచడంలో క్రీడాకారులు కీలకం

- అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు చేతన్ ఆనంద్

ప్రజాశక్తి - పాణ్యం

దేశ ఖ్యాతిని పెంచడంలో క్రీడాకారులు ముందువరుసలో ఉంటారని ప్రముఖ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, అర్జున్ అవార్డు గ్రహీత చేతన్ ఆనంద్ పేర్కొన్నారు. శనివారం పాణ్యం సమీపంలోని ఆర్‌జిఎం ఇంటర్నేషనల్ స్కూల్లో స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చేతన్ ఆనంద్ విచ్చేసి క్రీడాజ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారుల వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని పాఠశాల యాజమాన్యాన్ని కోరారు. విద్యార్థులు తమకు నచ్చిన క్రీడలు ఎంచుకొని వాటిలో నైపుణ్యం సంపాదించాలన్నారు. క్రీడాకారులు ఆరోగ్యంగా ఉండాలంటే మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. శారీరక ధృఢత్వం కోసం క్రీడలను ఎంచుకోవాలని తెలిపారు. విద్యార్థులు సెల్ ఫోన్‌తో జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. రోజువారి దినచర్యలో భాగంగా విద్యార్థులు క్రీడల్లో పాల్గొనాలన్నారు. క్రీడలు అనారోగ్యాన్ని, వైద్యున్ని దూరం చేస్తాయన్నారు. చదువుతోపాటు ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. ప్రస్తుతం భారత క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను కనబరుస్తూ దేశానికి పేరు ప్రఖ్యాతులు తెస్తున్నారని అన్నారు. పాఠశాల ఎండి మిద్దె శివరాం మాట్లాడుతూ పాఠశాలలో సింథటిక్ క్రీడామైదానం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలన్న దృక్పథంతో రాయలసీమలో మొట్ట మొదటి సారిగా రెసొనెన్స్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకొని ఉన్నత ప్రమాణాలతో విద్య అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలన్న ఉద్దేశంతో ప్రత్యేక క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం పలు క్రీడల్లో విజేతలుగా నిలిచిన వారికి చేతన్ ఆనంద్ ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ గాయత్రి, ఆర్జీఎం కళాశాల డీన్ డాక్టర్ అశోక్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న అంతర్జాతీయ క్రీడాకారుడు చేతన్ ఆనంద్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి

టిడిపిలో ప్రతి కార్యకర్తకూ గుర్తింపు : బిసి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

తెలుగుదేశం పార్టీలో ప్రతి ఒక్క కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బెలూం గ్రామానికి చెందిన పి.రఘురామిరెడ్డి, బి.హుసేనయ్య, అహమద్, మహేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో 50 కుటుంబాలు బిసి జనార్దన్ రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వారికి తెలుగుదేశం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గంలో నాపరాయి గనుల మీద ఆధారపడి వేలాది కార్మికులు జీవనం కొనసాగిస్తున్నారని, వైసీపీ ప్రభుత్వ అధికారులకు వచ్చాక మైనింగ్ లీజులపై రాయల్టీ చార్జీలు పెంచడంతో యజమానులపై అదనపు భారం పెరగడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడిందన్నారు. నాపరాయి ఆధారపడ్డ కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం గెలిచి అధికారంలోకి వస్తే నాపరాయిపై అదనపు చార్జీల తగ్గిస్తామని, ప్రతి ఒక్కరికి ఇండ్ల పట్టాలు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఏం రామేశ్వర్ రెడ్డి, ప్రచార కార్యదర్శి శివరామిరెడ్డి, ఇటిక్యాల శివాండ్డి, నాయకులు పాల్గొన్నారు.

నేడు జిల్లా జూనియర్ హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి -నంద్యాల కలెక్టరేట్ : నంద్యాల పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో ఉన్న గుడ్ షెఫర్డ్ పాఠశాల మైదానంలో నేడు ఆదివారం జిల్లా జూనియర్ బాల బాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా హ్యాండ్ బాల్ సంఘం ప్రతినిధులు మహబూబ్ బాషా, రామేశ్వర్ రెడ్డి, రాజ్ కుమార్ రెడ్డిలు శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ క్రీడాకారులు పాఠశాల మైదానంలో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు. ఎంపికైన బాలికల జట్టు ఈ నెల 12, 13 తేదీల్లో రాజంపేటలో జరిగే 45వ రాష్ట్రస్థాయి జూనియర్ హ్యాండ్ బాల్ బాలికల చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. 19 ఏళ్ల లోపు బాల బాలికలు ఎంపిక పోటీలకు అర్హులని, వయసు ధ్రువీకరణ పత్రంతో ఎంపిక పోటీల్లో పాల్గొనాలన్నారు.

15 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - మహానంది : మండలంలోని గాజులపల్లె సమీపంలోని బుచ్చమ్మ తోట వద్ద గాజులపల్లె గ్రామానికి చెందిన నరసింహులు నుండి 15 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు మహానంది ఎస్ఐ జి.నాగేంద్రప్రసాద్ శనివారం పేర్కొన్నారు. నరసింహులుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధి వైసిపితోనే సాధ్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

అభివృద్ధి, సంక్షేమం వైసిపితోనే సాధ్యమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని నందివర్గం గ్రామంలో 1 కోటి 9 లక్షల 64 వేల రూపాయలతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, వైయస్సార్ హెల్త్ క్లినిక్, సీసీ రోడ్లను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలు ప్రారంభించారు. అనంతరం 110 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోట్లాది రూపాయలతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లలా భావించి రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, బనగానపల్లె మండల కన్వీనర్ సన్నాల జనార్దన్ రెడ్డి, కుర్ని సంఘం రాష్ట్ర డైరెక్టర్ మేటికల శ్యామలాదేవి, ఎంపిపి మానసవీణ, వైస్ ఎంపిపి మంగవరపు లక్ష్మీదేవి, ఎంపిటిసి మేటికల నారాయణ, గ్రామ సర్పంచ్ వీరం రెడ్డి లక్ష్మీదేవి, ఉప సర్పంచ్ షేక్ మహమ్మద్ షరీఫ్, వైసిపి నాయకులు వీరం రెడ్డి శేఖర్ రెడ్డి, బాదినేని శ్రీనివాసులు, దేశం శ్రీనివాస రెడ్డి, మాజీ ఎంపిటిసి సంటెన్న, పాణ్యం నాగేశం, మాజీ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు మెటికల విజయ కుమార్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖర్, మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి, పిఆర్ ఏఈ మహేష్, పంచాయతీ కార్యదర్శి సుహాసిని, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్మన్

క్షేత్రంలో రాజకీయాలు తగదు

- ఏ ఒక్క కార్యకర్తకు అన్యాయం జరిగినా ఊరుకోం : మాజీ ఎమ్మెల్యే



తొలగించిన షాప్‌ను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మహానంది

మహానంది క్షేత్ర పరిధిలోని టిటిడి కళ్యాణ మండపం సమీపంలో గత కొన్ని సంవత్సరాలుగా బార్బర్ షాప్ నిర్వహించుకుంటూ జీవిస్తున్న మహానంది గ్రామానికి చెందిన మంగలి సుబ్బరాయుడు టిడిపిలో చేరినందుకు షాప్ తొలగించడం దారుణమని, క్షేత్రంలో రాజకీయాలు తగదని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం బాధితుని షాపును మాజీ ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం దేవస్థానం అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గంలో ఏ ఒక్క కార్యకర్తకు అన్యాయం జరిగినా సహించబోమని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రంలో సుమారు 120 నెలల నుంచి నెలకు మూడు వేలు చొప్పున ఒక్క రూపాయి కట్టకుండా వున్నారని, ఆ షాపులను అలాగే ఉంచి, ప్రతి నెలా కరెక్ట్‌గా బాడుగ దేవస్థానం వారికి కడుతున్న సుబ్బరాయుడు షాపును తొలగించడం అన్యాయమన్నారు. తిరిగి బాధితునికి షాపు నిర్వహించుకునేందుకు వీలుగా స్థలం చూపించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు, కార్యకర్తలు, బాధితుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలం

ప్రజాశక్తి - రుద్రవరం : ప్రస్తుత జీవనశైలిలో చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎస్.సరళమ్మ తెలిపారు. శనివారం సిరివెళ్ళ మండలం గోవిందపల్లి గ్రామంలో మహిళలకు 'చిరుధాన్యాలు-వాటి ప్రాముఖ్యత' అంశంపై ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత జీవనశైలితో మనుషులకు మధుమేహం, రక్తహీనతతో పాటు వివిధ ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని చెప్పారు. మంచి ఆరోగ్యం కోసం చిరుధాన్యాలు విధిగా ఉపయోగించాలని తెలిపారు. ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.బాలాజీ నాయక్, వ్యవసాయ అధికారి ప్రభావతమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్.సరళమ్మ

ఎత్తిపోతలను తుంగలో తొక్కిన ఎమ్మెల్యే : బిసి

ప్రజాశక్తి - అవుకు

తెలుగుదేశం పార్టీ పాలనలో రైతుల కోసం సంఘపట్నం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తే వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆ పథకాన్ని తుంగలోకి తొక్కారని బనగానపల్లె మాజీ శాసనసభ్యులు బీసీ జనార్దన్ రెడ్డి విమర్శించారు. శనివారం అవుకు మండలంలోని సంఘపట్నం గ్రామంలో బాబు షూ్యరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడపకు ఆయన తిరుగుతూ టిడిపి సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రతి ఒక్కరికి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన హయాంలో సంఘపట్నం గ్రామ ప్రజల దాహార్తిని తీర్చేందుకు 160 లక్షలతో ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తే ఎమ్మెల్యేగా కాటసాని రామిరెడ్డి గెలిచిన తర్వాత ఎత్తిపోతల పథకాన్ని నిర్వీర్యం చేశారని ఆరోపించారు. గత టిడిపి హయాంలో గ్రామంలో 170 లక్షలతో సిసి రోడ్లు వేయగా వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏ ఒక్క రోడ్డు వేయలేదన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని ఆదరించి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఐవి పకీర రెడ్డి,యువ నాయకులు మల్లికార్జునరెడ్డి, ఉగ్రసేనారెడ్డి ,ఇంద్రసేనారెడ్డి, ఐసర్ బాష, చిన్న ఈశ్వర్ రెడ్డి, సర్పంచు లక్ష్మి, జనసేన నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



టిడిపి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి



డాక్టరేట్‌ను అందుకుంటున్న వరికుంట ఓబులేసు

ఆళ్లగడ్డ వాసికి డాక్టరేట్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ మండలం యాదవాడ గ్రామానికి చెందిన వరికుంట గుర్రన్న కుమారుడు వరికుంట ఓబులేసుకు అనంతపురం జేఎన్టీయూ యూనివర్సిటీ వారు స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ డిగ్రీ డాక్టరేటు ప్రదానం చేశారు. రాయలసీమలో భారతీయ స్టేట్ బ్యాంకు శాఖలలో పని చేస్తున్న ఉద్యోగులు, ఉద్యోగ సంతృప్తి మూల్యాంకనానికి సంబంధించి చేసిన పరిశోధనకు డాక్టరేట్‌ను అందజేశారు. బ్యాంకులో ఉద్యోగులు ఆధునిక విద్యతో పాటు అందుకు సంబంధించిన నైపుణ్యాలను ఉపయోగించుకొని బ్యాంక్‌ల అభివృద్ధికి ఎలా పాటుపడాలో తెలియజేశారు. ప్రొఫెసర్ సుధీర్ కుమార్ పర్యవేక్షణలో ఈ పరిశోధన నిర్వహించామని డాక్టరేట్ గ్రహీత వరికుంట ఓబులేసు తెలిపారు. వరికుంట ఓబులేసుకు డాక్టరేట్ రావడం పట్ల షేక్ రహీం బాషా, షేక్ షరీఫ్ బాషాతో పాటు పలువురు అభినందనలు తెలియజేశారు.

గిరిజనుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : చెంచు గూడెంలలో నివసిస్తున్న గిరిజనుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో మహబూబ్ ఖాన్, తాహసిల్దార్ హరినాథ్ రావు అన్నారు. శనివారం మండలంలోని అహోబిలం గ్రామపంచాయతీ పరిధిలోని చెంచుగూడెంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి జనజాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ కార్యక్రమం ద్వారా గిరిజనులందరికీ పక్కా ఇల్లు, ప్రతి ఇంటికి మంచినీటి కొళాయి, విద్యుత్తు కనెక్షన్, గ్రామానికి రహదారుల సౌకర్యం, అందరికీ నాణ్యమైన విద్య, వైద్య సదుపాయం నైపుణ్య వికాసం పౌష్టికాహారం తదితర వాటిని కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రామకృష్ణ నాయక్, పంచాయతీ రాజ్ ఏఈ కమాల్ సాహెబ్ , ఉపాధి ఏపీఓ గణేష్ పంచాయతీ కార్యదర్శి నరసింహ, సచివాలయ సిబ్బంది, గిరిజనులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

8న వికసిత్ భారత్ సంకల్పయాత్ర

- ఏర్పాట్లను పరిశీలించిన జెసి

ప్రజాశక్తి - పగిడ్యాల



మోడల్ స్కూల్‌ను పరిశీలిస్తున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 వివిధ రకాల పథకాలపై ప్రజ లకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 8వ తేదీన అవగాహన సదస్సుకు ఏర్పాట్లను పరిశీలించేం దుకు జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి పగి డ్యాల గ్రామానికి శనివారం వచ్చారు. మోడల్ స్కూల్లో ఏర్పాట్లు చేసే విధంగా సంబంధిత అధికారులకు సూచనలు సలహాలు ఇచ్చారు. మండలంలోని అన్ని శాఖల అధికారులకు సదస్సును ఏర్పాటుకు బాధ్యతలు అప్పజెప్పారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడారు. వికసిత్ భారత సంకల్పయాత్రపై అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుం దన్నారు. ఈ సదస్సుకు కేంద్ర ఐటీ కమ్యూనికేషన్ శాఖ మంత్రి శ్రీ వైష్ణవ్ హాజరవుతారని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 వివిధ రకాల పథకాలను పేదవాళ్లకు అందించే విధంగా వారికి అవగాహన కల్పించే విధంగా సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలు అందని పేద ప్రజలకు తక్షణమే పథకాలను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీరాజ్ అధికారి మంజువాణి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రావు, హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, ఆత్మకూర్ ఆర్డీవో దాసు, నాబార్డ్, బ్యాంకు అధికారులు, మండల స్థాయి అధికారులు, మాజీ జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-డోన్

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాతపేట డోన్ నందు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌పై శనివారం అవగాహన కల్పించారు. ఐఎస్ఐ,ఐఎస్ఓ, ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ ద్వారా ఉత్పత్తి అయ్యే వస్తువులను కొనుగోలు చేయాలని ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పిలుపుని చ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనము కొనే ప్రతి వస్తువుకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ వారిద్వారా లైసెన్స్ ఉండాలన్నారు. ఆ వస్తువులను ఉపయోగించడం వల్ల వినియోగ దారుడు నష్టపోరన్నారు. ప్రతి వస్తువు నాణ్యతా ప్రమాణాలు కలిగి ఉండాలని, అప్పుడే వస్తువు మన్నిక ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మొదటి 4స్థానాలు సంపాదించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,మల్కాపురం మెంటర్ శ్రీనివాసరెడ్డి,సీనియర్ ఉపాధ్యాయులు శివప్రసాద్,వెంకటలక్ష్మీ, లక్ష్మయ్య,సుభాన్,ప్రసాద్ రావు,మహేష్,అల్లిపీరా పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు

ప్రభుత్వం చేతకానితనంతోనే ఎస్మా ప్రయోగం : సిపిఎం

ప్రజాశక్తి - ఆత్మకూరు

సమ్మెను పరిష్కరించడం చేతకాకుండా వారిపైన ఎస్మా చట్టాన్ని ప్రయో గించి ప్రభుత్వము తమ చేతకానితనాన్ని నిరూపించుకుందని సిపిఎం పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్, పట్టణ నాయకులు ఏ. సురేంద్ర, డి. రామ్ నాయక్, షైక్ ఇస్మాయిల్‌లు అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వమే తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు ఎక్కువగా వేతనాలు ఇస్తానని చెప్పిన ప్రభుత్వం మాట తప్పి మడమతిప్పి సమ్మె పైన నిర్బంధాన్ని ప్రయోగిస్తుందని అన్నారు. సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు జీతాలు కూడా తగ్గించి అంగన్వాడీల పైన కక్ష పూరితమైన చర్యలు ఈ ప్రభుత్వం తీసుకుంటుందని అన్నారు. ఈ ప్రభుత్వానికి భవిష్యత్తులో అంగన్వాడీ కార్మికులు ,వారికి మద్దతు ఇస్తున్న అన్ని రకాల ప్రజా సంఘాలు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని తక్షణమే ప్రభుత్వం ఎస్మాని ఎత్తివేసి అంగన్ వాడీలతో చర్చలు జరిపి వారి సమస్యలు పరిష్కరించాలని ,లేనట్లయితే భవిష్యత్తులో మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

చేపట్టవలసి వస్తుందని వారు తెలియజేశారు.

అంగన్వాడీలపై ప్రభుత్వం నిరంకుశం : - ఏపీ రైతు సంఘం

అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం నిరంకుశమైన చర్య అని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ ఓ ప్రకటనలో ఖండించారు. కార్మికుల సమస్యలపై చివరి అస్త్రంగా సమ్మె చేయటం కార్మికుల హక్కని అలాంటి హక్కును ఉక్కు పాదంతో అణిచివే యా లనే ప్రభుత్వ చర్యను ప్రజాసంఘాలు మేధావులు ఖండించాలని అన్నారు. జీవో నెంబర్2ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

రుద్రవరం : సమస్యలు పరిష్కరించాలని 26 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు ఏమాత్రం న్యాయం చేయని రాష్ట్ర ప్రభుత్వం నియంతంగా మారి ఎస్మా చట్టాన్ని విధించడం సిగ్గుచేటని, ప్రభుత్వ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం జిల్లా నాయకులు టి. రామచంద్రుడు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమ్మె అణచివేత కోసం తెచ్చిన జీవో 2ను వెంటనే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కంటే ముందు అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చెయ్యలేని ముఖ్యమంత్రి మాట తప్పి, మడుమ తిప్పినందువల్లనే గత్యంతరం లేక అంగన్వాడీ మహిళలు రోడ్లపైకి వచ్చి నిరసనలు, సమ్మె కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఎస్మా చట్టం రద్దు చేయాలని, అంగన్వాడీల జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు.



సంక్రాంతి సంబరాలలో శ్లోక విద్యార్థులు

'శ్లోక'లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

పట్టణంలోని శ్లోక సిబిఎస్ఇ పాఠశాల నందు శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు భోగి మంటలు, సంక్రాంతి రంగవల్లులు వేశారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి నృత్యాలు చేస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్ర మానికి అతిథులుగా పాఠశాల చైర్మన్ శ్రీధర్ రెడ్డి, కరస్పాండెంట్ డాక్టర్ జె. శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్స్ కవిత, శ్రీదేవి రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

జొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తాం : ఎఒ

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్



మాట్లాడుతున్న ఏవో స్వాతి

మండలంలోని రైతు భరోసా క్లస్టర్‌గా ఏర్పాటు చేసి త్వరలోనే జొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని మండల వ్యవసాయ అధికారి స్వాతి తెలిపారు. శనివారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన సమావే శంలో ఎఒ మాట్లాడుతూ మండలంలోని రైతు భరోసా కేంద్రాలను క్లస్టర్‌గా ఏర్పాటు చేసి పౌర సంబంధాల శాఖ అనుసంధానంతో నాణ్యత ప్రమాణాలకు లోబడి జొన్న ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు జొన్న పంటను ఈ క్రాప్ బుకింగ్ చేసుకొని, ఈ కేవైసీ చేసి ఉండాలని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలకు లోబడి కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కొనుగోలుకు అవసరమైన బ్యాగ్స్ హమాలి చార్జీలు రవాణా చార్జీలు ప్రభుత్వమే భరిస్తుందని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని వారు సూచించాంచారు.

చెప్పిన మాట ప్రకారం రూ.3 వేలు పెన్షన్

- మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు వైయస్ఆర్ రఫీ

ప్రజాశక్తి-డోన్

నవరత్నాలలో భాగంగా చెప్పిన మాట ప్రకారం రూ.3000 పెన్షన్ ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికే సాధ్యమని డోన్ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రఫీ అన్నారు. శనివారం డోన్ పట్టణంలోని



పింఛన్లు పంపిణీ చేస్తున్న నాయకులు

పాతపేట పరిధిలో ఐదవ సచివాలయంకు సంబంధించిన ఏడో వార్డులో పింఛన్ల పంపిణీ కార్యక్రమం డోన్ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు వైయస్ఆర్ రఫీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు వైయస్ఆర్ రఫీ మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా అతి ఎక్కువ పెన్షన్లు ఎక్కువ మందికి ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశే అన్నారు. సంక్షేమ సారథి జగన్ వల్లే సాధ్యం అయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది,వాలంటీర్లు,వార్డు ప్రజలు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సిఎం జగన్

- మాజీ జడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి

పగిడ్యాల : పేదల కోసం అనేర సంక్షేమ పథకాలు పెట్టిన ముఖ్యమంత్రి జగన్ పేదల పక్షపాతి అని జడ్పిటిసి పుల్యాల దివ్య, మాజీ జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో వైయస్సార్ పింఛన్ కానుక పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పేదవాడు అభ్యున్నతికి, అభివృద్ధికి ముఖ్యమంత్రి అహర్నిశలు పాటుపడుతున్నా రన్నారు. ఇచ్చిన మాట మేరకు రూ. 3 వేల పింఛన్ కానుక కింద అవ్వ తాతలకు, వితంతువులకు వికలాం గులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెరుమాళ్ళ శేషన్న, ఎంపీడీవో వెంకటరమణ, తహశీల్దార్ భారతి, ఎంఈఓ సుభాన్ సచివాలయ సిబ్బంది వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ జడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి

పెట్రోల్ బంక్‌ను పరిశీలించిన జెసి

ప్రజాశక్తి - పాములపాడు

మండలంలోని జూటూరు గ్రామ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌ను నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి పరిశీలించారు. పాములపాడు తాసి ల్దార్ రత్న రాధిక, మండల సర్వేయర్ భాస్కర్, వీఆర్వో సామేలు పాల్గొన్నారు.



కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : ఐఎఫ్‌టియు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

రాష్ట్రంలో వివిధ శాఖలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని శనివారం స్థానిక సుండిపెంట శ్రీశైల మండల తాసిల్దార్ రాజేంద్ర సింగ్‌కు ఐఎఫ్‌టియు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వై. ఆశీర్వాదం, వై. శీను కలిసి వినతి పత్రం ఇచారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికులను అనచి వేసే విధంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వం తక్షణమే వారిని చర్చలకు పిలిచి వారి సమస్యలు పరస్కరించాలన్నారు. మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక ఐఎఫ్‌టి నాయ కులు ఏ.బెనహర్, ఎస్కే వలి, మస్తాన్, వెంకటేశ్వర్లు, భాస్కర్,రాజు పాల్గొన్నారు.

అంబాపురం సర్పంచికి రిమాండ్

ప్రజాశక్తి - బేతంచర్ల : మండల పరిధిలోని అంబాపురం గ్రామానికి చెందిన సర్పంచ్ కురువ శ్రీనివాసులు బ్యాంకును, ప్రభుత్వాన్ని మోసం చేశాడని తాసిల్దార్ నరేంద్ర నాథ్ రెడ్డి ఇచ్చిన రిపోర్టుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివ శంకర్ నాయక్ శనివారం తెలిపారు. ఆర్ఎస్ రంగాపురం గ్రామ పరిధిలో ప్రభుత్వ భూమిలో శ్రీనివాసులు 2019లో తమ పూర్వీకులకు చెందిన భూమిగా నకిలీ ధ్రువపత్రాలతో తన పేరు మీదుగా తన భార్య చందన పేరు మీదుగాపట్టాదారు పాస్ పుస్తకాలను సృష్టించి బ్యాంక్‌లో లోన్ తీసుకొని చెల్లించకుండా అలాగే ప్రభుత్వ భూమిని తీసుకొని ప్రభుత్వాన్ని మోసం చేశాడని తాసిల్దార్ రిపోర్టు మేరకు శ్రీనివాసులు అరెస్ట్ చేసి డోన్ కోర్టులో హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - మిడతూరు

మండలంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో నూతన కోర్టు క్యాలెండర్లను ఎస్సై జగన్మోహన్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాశక్తి క్యాలెండర్ కోర్టులో సెలవు దినాలను బాగా ప్రచరింప చేస్తారని అవి పోలీసు వారికి, అటు లాయర్లకు ఎంతో ఉపయోగపరంగా ఉంటాయని అన్నారు. ఏఎస్ఐ సుబ్బయ్య, కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం



నంద్యాల కలెక్టరేట్ : నిరసన తెలుపుతున్న కార్మికులు

బహిరంగ సభను విజయవంతం చేయాలి

మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

ప్రజాశక్తి - చాగలమర్రి

ఈనెల 9వ తేదీన ఆళ్లగడ్డలో టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ కోరారు. శనివారం స్థానిక పాత బస్టాండ్ కాలనీలోని మహబూబ్ టాకీస్ ఆవరణంలో మండలంలోని వివిధ గ్రామాల టిడిపి నాయకులు కార్యకర్తలు భూమా అభిమానులతో నిర్వహించిన సమావే శంలో ఆమె మాట్లాడారు. బహిరంగ సభకు సుమారు లక్ష మందితో జన సమీకరణ చేస్తున్నామ న్నారు. చాగలమర్రి మండలం నుంచి సుమారు 15 వేల మంది తరలి రావాలని ఆమె కోరారు. నియోజకవర్గ యువ నాయకులు భార్గవ్ రామ్ నాయుడు, భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి, అబ్బర్వర్ ముక్తియార్, టిడిపి మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి, టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు అన్సర్ భాష, టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, జిల్లా టిడిపి మైనార్టీ నాయకులు కొలిమి హుస్సేన్ వల్లి, కొలిమిమాబు షరీఫ్, సల్ల నాగరాజు, మౌలాలి, ముల్లా అజీమ్ మద్దూరు మాబులాల్ ముల్లా షాబుల్ ముల్లా గఫార్ ఆకుల ఇర్షాద్, జట్టి నాగరాజు బషీర్ నాగూర్ జహీర్ వలి కొలిమి హుస్సేన్ పీర ,సోను, సాదాఫ్ కొలిమి మా భాష కొలిమి సున్ని అబ్దుల్లా గాంధీ కె ఆర్ కె రవి వీరం రెడ్డి భాస్కర్ రెడ్డి, కామిశెట్టి రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

సమస్యలు పరిష్కరించాలి

- ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ డిమాండ్
- మున్సిపల్ కార్యాలయాల ఎదుట కార్మికులు బైఠాయింపు



ఆత్మకూర్ : కమిషనర్ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు



నందికొట్కూరు టౌన్ : మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మున్సిపల్ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కృష్ణయ్య, భాస్కరాచార్యులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ చేపట్టిన సమ్మెలో భాగంగా12వ రోజు శనివారం మున్సిపల్ కార్యాలయం గేటు వద్ద బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26,000, సమాన పనికి సమాన వేతనం, ప్రభుత్వ సంక్షేమ పథకాల వర్తింపు, జీవో నెంబర్ 7 ప్రకారం స్కిల్డ్, సెమి స్కిల్డ్ వేతనాలు అర్హులైన కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమ్మెకు సిఐటియు, సిపిఐఎంఎల్ నాయకులు సంఘీభావం తెలిపారు. సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్ , కే. మహమ్మద్ గౌస్, కోశాధికారి వెంకట లింగం, ఐయూఎంఎల్ పార్టీ నాయకులు సలాం మౌలానా, జాకీర్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆదాము, రామాంజనేయులు, నాగేశ్వరరావు, మురళి, సిద్దయ్య, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.. **బేతంచెర్ల :** మున్సిపల్ కార్మికుల సమస్యల ను పరిష్కారం చేయాలని కోరుతూ కనీస వేతనం రూ.26,000, సమాన పనికి సమాన వేతనం, సంక్షేమ పథకాలు కార్మికులందరికీ వర్తింప చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య, వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె 12వ రోజుకు బేతంచర్ల నగర పంచాయతీ కార్యాలయం ముందు సిఐటి యు ఆధ్వర్యంలో టెంట్ వేసుకొని నిరసన కార్య క్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించే అంత వరకు సమ్మె కొనసాగిస్తూనే ఉంటామని వారు హెచ్చరించారు. బేతంచెర్ల సిపిఎం బేతంచెర్ల పట్టణ ప్రధాన కార్యదర్శి వైబి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అసెంబ్లీలో చెప్పిన మాటలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. చర్చలకు ప్రభుత్వం ముందుకు రావాలని, లేకుంటే నిరవధిక సమ్మె ఉధృతం చేస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో రామసుబ్బయ్య, మద్దయ్య, రామాంజనేయులు, సుధాకర్, నాగన్న, ప్రేమ్ కుమార్, ఇంద్రమ్మ, పద్మ, కమలమ్మ, రామసుబ్బమ్మ, వెంకటలక్ష్మి, మద్దమ్మ, నాగమణి, లక్ష్మీదేవి, రంగడు, శివమ్మ,తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం దగ్గర 12వ రోజు నిరవదిక సమ్మె చేపట్టి, మున్సిపల్ కార్యాలయం ముట్టడి చేసి కమిషనర్ శ్రీనివాసరావు, కో ఆప్షన్ సభ్యులు రసీద్‌లకు వినతిపత్రం అందిం చారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ అధ్య క్షులు రజాక్, కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్య క్షులు రణధీర్, ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, గొడుగురాజు, జోసెఫ్, పెద్ద నాగరాజులు మాట్లాడారు. 2019 ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాల న్నారు. **ఎపి మీడియా ఫెడరేషన్ మద్దతు:** మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం స్పందిం చాలని, వారితో చర్చలు జరిపి వారి డిమాండ్లను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ నాయకులు సంఘీభావం తెలిపారు. **నందికొ ట్కూరు టౌన్ :** మున్సిపల్ కార్యాలయంను సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ముట్టడించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ మాట్లాడుతూ మున్సిపాలిటీ కార్మికుల సమస్య లను పరిష్కరించాలన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, స్కిల్ వేతనాలు అమలు, పిఎఫ్ ఈఎస్ఐలో ఉన్న లోపాలను సవరించి సక్రమంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు పరమేష్, భాస్కర్, నాగేశ్వరరావు, రామకృష్ణ, బాసిత్, ఖాజా బాషా, ప్రతాప్, బక్కన్న, డ్రైవర్ రాజు, దితరులు పాల్గొన్నారు.



నంద్యాల కలెక్టరేట్ : మాట్లాడుతున్న నాయకులు



నందికొట్కూరులో జెసికి వినతి ఇస్తున్న నేతలు



నందికొట్కూరు టౌన్: సిద్ధార్థరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న అంగన్వాడీలు



బేతంచెర్లలో జిఒ ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం

'ఎస్మా' హాస్యాస్పదం

5వ పేజీ తరువాయి.. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి నాగరాణి, ప్రాజెక్ట్ కార్యదర్శి బి.సునీత, అంగన్‌వాడి టీచర్లు కె.మల్లేశ్వరి, రాధక్రిష్ట వేణి, సరస్వతి, శాంతి, రేణుక, వరలక్ష్మి, హేమలత, రత్నమ్మ, ేవతి, జ్యోతి, మధురవాణి, ఆయాలు మదార్‌బీ, మల్లేశ్వరి, రామలక్ష్మి, రిబకమ్మ, ఏ. కుమారి, వెంకట సుబ్బమ్మ, మినీ అంగన్‌వాడి టీచర్ తిరుపాలమ్మ తదితరులు కూర్చున్నారు. ఈ దీక్షలకు డివైఎఫ్ఐ నాయకులు శివ, న్యాయవాదులు శ్రీనివాస మూర్తి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు సంఘీభావం తెలిపిన మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

మహానంది : మహానంది తహశీల్దార్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి కార్యకర్తలు చేపట్టిన సమ్మెకు శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలపై ఎస్మాచట్టం ప్రయోగిం చడం హేయమైన చర్యగా అభివర్ణించారు. ఎన్నిక లకు ముందు హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వాటిని తుంగలో తొక్కారన్నారు. ఎస్మా చట్టం పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం లాంటిదన్నారు. రాబోయేది టిడిపి ప్రభుత్వమేనని, అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడిల సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త రెడ్డి, మండల నాయకులు ఉల్లి మధు, కాకర్ల శివ, అస్లాం బాష, తదితరులు పాల్గొన్నారు. **రుద్రవరం :** రుద్రవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు 26వ రోజు సమ్మెను కొనసాగించారు. అంగన్వాడి నాయకురాళ్ళు మనోజ, పద్మ, రాజ్యలక్ష్మి, బిబి, నాగలక్ష్మి, లలితమ్మ, తిరుపాలమ్మ తదితరులు పాల్గొన్నారు. **పాణ్యం :** స్థానిక ఎంపీడీవో ఆఫీస్ ముందు అంగన్వాడి వర్కర్స్ తమ సమస్యల పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న సమ్మెకు టిడిపి నాయకులు మద్దతు తెలిపారు. టిడిపి మండల నాయకులు లీగల్ సెల్ లాయర్ బాబు, కొండ జూటూరు మాజీ సర్పంచ్ నారాయణ, యాకోబు, కేశవ, ఇర్ఫాన్, నెరవాడ అమరసింహారెడ్డి, తదితరులు మాట్లాడారు. అంగన్వాడీ యూనియన్ మండల నాయకురాలు వెంకటమ్మ, మాబునిస, శ్యామల, మరియమ్మ, హైమావతి, సూర్య ప్రభావతి, అనసూయ, లక్ష్మీదేవి, ప్రభావతి, శివమ్మ, వెంకటమ్మ, భారతి , విద్యార్థి సంఘం నాయకులు ప్రతాప్, వెంకటాద్రి పాల్గొ న్నారు. **నందికొట్కూరు టౌన్ :** అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి, జిల్లా జాయింట్ కలెక్టర్‌కి నందికొట్కూరుకు వచ్చిన సందర్భంగా వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం నాగేశ్వర రావు, సిఐటియు పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ, నాయకురాలు మదర్ బి మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్స్ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శైలజ, సుజాత, వెంకటలక్ష్మి, లక్ష్మీదేవి, హరిత, నాగలక్ష్మి, కీర్తి, తదితరులు పాల్గొన్నారు. **పగిడ్యాల :** అంగన్వాడీలపై ఎస్మా చట్టాన్ని ఉపయోగించడం దారుణమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే భాస్కర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో నిరసన చేస్తున్న అంగన్వాడీలు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర అవగాహన సదస్సు కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలిం చేందుకు వచ్చిన జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డికి అంగన్వాడీలు వినతి పత్రం ఇచ్చేందుకు వెళితే పోలీసులు ముగ్గురు మాత్రమే వెళ్లి వినత పత్రం ఇవ్వాలని చెప్పడంతో ర్యాలీగా అందరం కలిసి వెళ్తామని అంగన్వాడీ కార్యకర్తలు చెప్పడంతో జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి కారు ఎక్కి వెళ్లిపోయేందుకు ప్రయత్నించారు. అంగన్వాడీలు కారుకు అడ్డంగా నిలబడి వినతి పత్రం తీసుకోవాలని నినాదాలు చేయడంతో జాయింట్ కలెక్టర్ కారు దిగి అంగన్వాడీల నుంచి వినతి పత్రం స్వీకరించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని జాయింట్ కలెక్టర్ అంగ న్వాడీలతో తెలిపారు. **ఆత్మకూరు :** పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు నిరవధిక సమ్మె కొనసా గించారు. అనంతరం ఎన్టీఆర్ సర్కిల్లో జీవో నెంబర్ 2 కాపీ లను దహనం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి మంజుల, నాయకురాలు లక్ష్మీదేవి, ప్రమీలమ్మ, సిఐటియు పట్టణ అధ్యక్షులు రజాక్, కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్‌లు మాట్లాడారు. యూనియన్ నాయకురాలు విజయలక్ష్మి, లక్ష్మీదేవి, సుజాత, సుధారాణి, లక్ష్మి, ప్రియాంక, రవణమ్మ, అరుణ, సిఐ టియు నాయకులు సురేంద్ర, స్వాములు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. **మిడ్తూర్‌లో** అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా వ్యాకాస జిల్లా సహాయ కార్యదర్శ పి.పకీరి సాహెబ్, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శి డి సుబ్బమ్మ, జి లక్ష్మి కుమారి మాట్లాడుతూ ఏస్మా చట్టాన్ని ప్రయోగిస్తే భయపడిదేలేదని పేర్కొన్నారు. యూనియన్ నాయకులు శైలజ జయమ్మ, కే రాధిక, మారెమ్మ, బిస్మిల్లా, హరిప్రియ, డి రాధిక పాల్గొన్నారు. **జూపాడుబంగ్లాలో** తాసిల్దార్ కార్యాలయం వద్ద జీవో నెంబర్ 2ను రద్దు చేయాలని అంగన్వాడీలు నినాదాలు చేసి జిఒ కాపీలు దహనం చేశారు. ఎపి వ్యకాసం జిల్లా నాయకులు ఎం. కర్ణ, సిఐటియు నాయకులు పద్మావతి హాజరై మాట్లాడారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు వెంకటరమణమ్మ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు. **శ్రీశైలం ప్రాజెక్ట్ :** దీక్షా శిబిరంలో అంగన్వాడీలు మోకాళ్లపై కూర్చొని, తలపై నినాదాలతో కూడిన క్యాప్ పెట్టుకొని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు రమణమ్మ, కాశమ్మ మాట్లాడుతూ ప్రభుత్వము యస్మా చట్టం ఉపయోగించిన ఈ తాటాకు చప్పుళ్ళకు భయపడేది లేదని హెచ్చరి ంచారు. **కొత్తపల్లి :** మండలంలో అంగన్వాడీలు ఒంటికాలితో నిలబడి దండం పెడుతూ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా నాయకురాలు ఈ హరిత, నాగమణి, శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వం చర్చల పేరుతో బెదిరిం పులకు దిగడం సరికాదన్నారు. **బండి ఆత్మకూర్:** అంగన్వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దుర్మార్గం అని సిఐటియు మండల కార్యదర్శి రత్నమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి డేవిడ్ అన్నారు. అంతకుముందు జీవో ప్రతులను అంగన్వాడీలు దహనం చేస్తూ నిరసన తెలిపారు. నాయకులు వెంకటరమణమ్మ, ఆనందమ్మ, శ్యామల, వసంత తదితరులు పాల్గొని మాట్లాడారు. **బేతంచర్ల :** కనీస వేతనం అడిగితే అంగన్వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించి బెదిరించడం సరికాదని సిఐటియు జిల్లా నాయకులు వైబి వెంకటేశ్వర్లు, వై ఎల్లయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమ్మెలో భాగంగా బేతంచర్ల భారత్ బేకరీ సర్కిల్ నందు జీవో ప్రతులను యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ కె నాగలక్ష్మి, ఎస్ గుల్జార్బిల ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. **పాములపాడు మండలంలో** అంగన్వాడీలు సమ్మెలో ఒంటి కాళ్లతో నమస్కారం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకు రాలు శివలక్ష్మి, నాగమద్దమ్మ, నాగమణి, రవణమ్మ బాయ్, శ్రీలత పాల్గొన్నారు. **గడివేముల :** గడివేముల తాసిల్దార్ కార్యాలయము నందు దీక్ష చేస్తున్న అంగన్వాడీ వర్కర్లకు మండల టిడిపి నాయకులు దేశం సత్యనారాయణ రెడ్డి తన సొంత నిధులతో దాదాపు 200 మంది అంగన్వాడీ వర్కర్లకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు సత్యనారాయణ రెడ్డికి, మాజీ జెడ్పిటిసి సీతారామిరెడ్డికి ధన్యవాదములు తెలిపారు.



పాములపాడు : ఒంటికాలిపై నిరసన చేస్తున్న దృశ్యం



మిడ్తూర్‌లో.. నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



కొత్తపల్లి : ఒంటికాలి మీద నిరసన తెలుపుతున్న దృశ్యం